Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు   స్థాపితం: 1930   జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 9 • 26-2-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
సంతపేటమార్కెట్ దగ్గర, పొగతోట, నెల్లూరు. సెల్: 99083 22007

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

• నడికుడి రైలుతో

## నెల్లూరుకెంతో మేలు!

నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు మెట్ట ప్రాంతాల మీదుగా ఒక కొత్త రైలు మార్గం నిర్మించడానికి బడ్జెట్‌లో ప్రతిపాదన చేశారు కేంద్ర రైల్వేమంత్రి మమతా బెనర్జీ. దాదాపు ఇరవై ఏళ్ల కల ఇది. నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడే దీనికోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సర్వే జరిపించారు. అప్పటినుంచి వచ్చిన ప్రతి రైల్వే మంత్రినీ కలిసి, విన్నవిస్తూనే వున్నాడు. కొన్ని వందల జాబులు వ్రాసి వుంటాడు ఇందుకోసం. ఇన్నాళ్లకు మమతా పుణ్యమా అని అహల్యా శాపవిమోచనం జరిగింది ఈ ప్రతిపాదనకు.

నల్గొండ జిల్లాలోని నడికుడి జంక్షన్ నుంచి వినుకొండ, దర్శి, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, రాపూరు, వెంకటగిరి మీదుగా శ్రీకాళహస్తికి రైలు పట్టాలు వేయడం దీని వుద్దేశం. 309 కిలోమీటర్ల దూరం వుంటుందిది. ఇప్పటి లెక్కల్లో 1300 కోట్ల ఖర్చు. విజయవాడ రూటుతో పోలిస్తే, హైదరాబాద్ గూడూరుల మధ్య దాదాపు 169 కిలోమీటర్ల దూరం తగ్గి పోతుంది. తుఫాన్లు, వరదలకు విజయవాడ రైలు పట్టాలు తెగినా హైదరాబాదు నుంచి రాకపోకలకు ఇబ్బంది వుండదు. మెట్ట ప్రాంతాల నుంచి నిమ్మకాయల వంటి వ్యవసాయ ఉత్పత్తులు,

కొరవ 14వ పేజీలో

## బాబు, రోశయ్య భాయి... భాయి?



శాసనసభ సమావేశాలు సాఫీగా జరిగిపోతున్నాయి. చిన్నపాటి సందడి కూడా లేదు. సభలో ప్రతిపక్షం అనేది వున్నట్లుండి అదృశ్యమై పోయిందా అని అనుమాన పడాల్సి వస్తున్నది. వారు వీరు ఒకటై పోయారు. ఆరోపణలు లేవు, ప్రత్యారోపణలు లేవు, అల్లర్లు లేవు, ఆగ భాగాలు లేవు, తిట్టు కోవడాలు లేవు, తన్ను కోవడాలూ లేవు. అందరూ అన్నదమ్ముల వలె కలిసి పోతున్నారు. ప్రాణస్నేహితుల మాదిరి కౌగిలించుకొంటున్నారు. బాబు రోశయ్య భాయి... భాయి అంటున్నారు.

గత పదిహేనేళ్లుగా చంద్రబాబు, వైఎస్.రాజశేఖర్‌రెడ్డిల మధ్య శాసనసభలో ఆవేశకావేషాలను చూడడానికి అలవాటుపడిన రాష్ట్ర ప్రజలకు ఈ కొత్త వాతావరణం వింత గొల్పుతున్నది. శాసనసభ సమావేశాలంటే చాలు, బాబు మీదకు ఒంటికాలితో వెళ్లేవాడు వైఎస్. ఆయన మీదకు అంతే స్థాయిలో విరుచక పడే వాడు బాబు. ఇద్దరి మధ్య కోపతాపాలు ఒక్కొక్కరోజు శాసనసభను చేపల మార్కెట్ కంటే హీనంగా మార్చేవి. సభలో మర్యాద కోసం కూడా ఇద్దరూ ముఖాముఖాలు చూసుకొనే వారు కాదు. పలకరింపులు వుండేవి కావు. సాంప్ర



కొరవ 14వ పేజీలో

## మెట్రో రైలులో నెల్లూరు ముఖ్యులు!

హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అర్హత పరిశీలనలో ముగ్గురు నెల్లూరు ప్రముఖులు ఎంపిక కావడం జిల్లాకు గౌరవం పెంచే విషయం. 12వేలా 500 కోట్ల రూపాయల ఖర్చు అంచనాతో, ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాజెక్ట్ ఇది. గతంలో దీనికి జరిపిన టెండర్లలో సత్యం అధినేత రామలింగ రాజుకు చెందిన మైటాస్ కంపెనీకి దక్కింది. కానీ దురదృష్టవశాత్తు రామలింగరాజు కష్టాలలో పడి పోవడంతో మళ్లీ టెండర్లు పిలిస్తున్నారు. ఆ టెండర్లలో పాల్గొనడానికి అర్హుల ఎంపిక జరిగింది ఇప్పుడు. మొత్తం ఎనిమిది కంపెనీలు అందుకు అర్హత పొందితే అందులో రెండు నెల్లూరీయులవి కావడం మనకు గర్వకారణం. వాటిలో మొదటిది జివికె గ్రూప్. పరిచయం అవసరం లేని కంపెనీ అది. చిన్న కాంట్రాక్టర్‌గా జీవితం ఆరంభించి, స్వయం శక్తితో, అపారమైన మేధా సంపత్తితో మెట్టు మెట్టుగా ఎదిగి, పారిశ్రామిక సామ్రాట్టుగా ఎదిగిన గొప్ప వ్యక్తి ఆయన. దేశంలోనే కాదు, పాశ్చాత్య ప్రపంచంలో కూడా ఈ రోజు జివికె పేరు తెలియనివారు లేరంటే ఆయన స్థాయి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.







రెండవ కంపెనీ విఎన్‌ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్. సూళ్లూరుపేట కాంగ్రెస్ వాది వాకాటి నారాయణరెడ్డి కంపెనీ అది. మూడేళ్లక్రితం వరకు ఆయన వ్యాపార రంగంలో అనామకుడు. ఇప్పుడు జివికె వంటి వారితో సమానంగా హైదరాబాద్ మెట్రో వంటి భారీ ప్రాజెక్టులకు పోటీ పడే స్థాయికి తన కంపెనీని వృద్ధి చేశాడు. ఈ వూహకందని అభివృద్ధి వెనుక నారాయణరెడ్డి అదృష్టం ఎంత వుందో, కష్టం కూడా అంతే వుంది. జిల్లాకే చెందిన మరొక ప్రముఖుడు తిక్కవరపు సుబ్బరామరెడ్డి గారి గాయత్రి కంపెనీ, నారాయణరెడ్డి కంపెనీతో కలిసి ఈ టెండర్‌లో పాలుపంచుకొంటున్నది.

ఇప్పుడు జరిగింది అర్హత పరీక్ష మాత్రమే. ఏప్రెల్ నెలలో టెండర్లు జరుపుతారు. వాటిలో కూడా వీరిలో ఎవరో ఒకరు మెట్రో రైలు ప్రాజెక్టు సాధించాలని, నెల్లూరు గౌరవం పెంచాలని మనసారా కోరుకొంటున్నాము.

## కార్టూన్ స్కేప్




పార్లమెంటుకు దగ్గరలో ఇల్లు వద్దంటే వినక పోతిరి...!

బలమైన, ఆరోగ్యకరమైన దంతాలకు
ఒకే ఒక్క చిరునామా! "స్మైల్"
పళ్లమధ్య సందులు, ఎత్తుపళ్లు, వంకరపళ్లను
స్మైల్ డిజైనింగ్ ద్వారా ఒక్కరోజులో సరిచేయవచ్చును.
ప్రభుత్వోద్యోగులకు అరుదైన అవకాశం.
నెలసరి వాయిదాలలో వైద్యఖర్చులను
చెల్లించే సదుపాయం.
స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్
ఫోన్స్: 0861-2344693, 92464 34447
నెల్లూరులో ప్రప్రథమంగా ISO 9001-2000 గుర్తింపు పొందిన డెంటల్ హాస్పిటల్

# దుర్మార్గ ఆర్థిక విధానాలు

భారతదేశం ప్రగతి చూసి యావత్ ప్రపంచం కుళ్లుకొంటున్నదని గొప్పగా చెప్పుకొంటున్నాము. మన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అయితే వీలు దొరికినప్పుడల్లా భారతదేశం అతి త్వరలోనే సూపర్ పవర్‌గా అవతరించనున్నదని డబ్బా వాయిస్తూ వుంటారు. అంతెందుకు, సాక్షాత్తు అమెరికన్ అధ్యక్షుడు బరాక్ ఒబామా వారే భారతదేశంతో జాగ్రత్తగా వుండండని తమ దేశ యువతను హెచ్చరించారు. మనల్ని మించి పోతుందని భయపెట్టారు. ప్రపంచ దేశాలన్నిటితో పోలిస్తే అత్యంత శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మనకు ద్వితీయస్థానం లభించింది. ప్రపంచ ఆర్థిక సంస్థ లెక్కలు ఆ ప్రకారం వున్నాయి.

మన రాష్ట్రం సంగతి చూస్తే ఇంకొంచెం అధికంగా నోరూరి పోతున్నది. ఈ ఏడాది లక్షా 13వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టాడు రోశయ్య. అభివృద్ధి కోసం ఏకంగా 50వేల కోట్ల వరకు ఖర్చు చేయబోతున్నట్లు ఘనంగా ప్రకటించాడు.

జమీన్‌రైతు

ఇదంతా నాణానికి ఒకవైపు. ఆదిలాబాద్ నగరంలోని ఒక బాలికల హాస్టల్‌లో మూడు రోజులుగా తినడానికి తిండిలేక, ఆకలి బాధతో దాదాపు 30 మంది విద్యార్థినులు శోష వచ్చి పడిపోయారు. మరొకరోజు అదే కొనసాగివుంటే, ప్రభుత్వ పోషణలో ఆకలి చావులు సృష్టించిన గొప్ప రాష్ట్రంగా ఘనత సాధించి వుండేది ఆంధ్రప్రదేశ్. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడిచే బాలికల హాస్టల్ ఇది. హైస్కూల్, ఇంటర్మీడియేట్ చదివే నిరుపేద విద్యార్థినులు 300 మంది వరకు వున్నారక్కడ. జిల్లాకలెక్టర్‌తో సహా అధికార గణం అంతా అక్కడకు ఒక ఫర్లాంగు దూరంలోనే నివాసం వుంటున్నారు. ఆ హాస్టల్‌కు ఆహారం సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఆరేడు నెలలుగా బిల్లులు చెల్లించలేదట. దానితో అతగాడు అన్నం పెట్టడం మానివేశాడు. ఏ అధికారికీ అది పెద్ద విషయంగా కనిపించలేదు. స్వంతంగా హోటల్‌కు, మరొకచోటకూ పోయి తిండి తినడానికి ఆ నిర్భాగ్య విద్యార్థినుల చేతిలో చిల్లి గవ్వ లేదు. మూడు రోజుల పాటు అట్లానే ఆకలి బాధతో అలమటించి పోయారు. వారిలో కొందరు శోష వచ్చి స్పృహ తప్పారన్న వార్త టివి ఛానళ్లలో రావడంతో అధికారులు పరుగెత్తారు. అక్కడి పరిస్థితి చూసిన స్థానిక ఆర్డీఓ భోరున విలపించాడట. దాన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు, అక్కడ ఎంత దయనీయమైన పరిస్థితి నెలకొని వున్నదో.

భారతదేశం సూపర్‌పవర్‌గా అవతరించడానికి ప్రపంచీకరణ విధానాలు కారణమని గొప్పగా చెప్పుకొంటూ వుంటారు మన్మోహన్ సింగ్ వంటి నేతలు. అదే సమయంలో ఇటువంటి విద్యార్థినుల ఆకలి కేకలు కూడా అవే ప్రపంచీకరణ విధానాలు కారణమన్న నిజాన్ని మర్చిపోతున్నారు. అమూల్యము, అపారమైన మన ప్రకృతి సంపదను కొద్దిమంది సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ నిధుల ప్రాధాన్యత అంతా ఆ వర్గాలకే దక్కుతున్నది. కోట్లాదిమంది నిరుపేదలను మరింత దరిద్ర నారాయణులుగా మారుస్తున్నది. లక్ష కోట్ల బడ్జెట్ కల్గిన రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లలకు ఒకపూట కూడా తిండి పెట్టలేని దారుణమైన పోకడ అవలంభించడానికి నేతల స్వార్థమే కారణం. ఖజానాకు వచ్చే ప్రతి పైసా తమలో తాము పంచుకొని తింటూ పేదల నోళ్లు కొడుతున్న దుర్మార్గ ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారు నాయకులు. ఈ నేరానికి నిష్కృతి లేదు. ఈ పాపానికి పరిహారం లేదు. ముఖ్యమంత్రితో సహా ఒక్క ప్రభుత్వ అధిపతి కూడా టీవీలలో, పత్రికలలో ప్రముఖంగా వచ్చిన ఈ ఆకలి వార్త పట్ల కనీసపాటి స్పందన చూపక పోవడంలోనే మన ప్రభుత్వాలు ఎంత పెడదారిలో నడుస్తున్నదీ చెప్పకనే చెప్తున్నది.

## జనవాణి

### రోశయ్య అంకెల గారడీ!

శాసనసభలో ముఖ్యమంత్రి రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అంకెల గారడీగా అభివర్ణించవచ్చు. ఈ యేడాది బడ్జెట్ పరిమాణం లక్షా పదమూడు వేల కోట్లు. 2005లో రాష్ట్ర బడ్జెట్ పరిమాణం 65కోట్లు మాత్రమే. రెట్టింపుకు పెరిగినా ఈ పెరుగుదల నిజమైన పెరుగుదల కాదు. ద్రవ్యోల్బణం ప్రభావం మాత్రమే. ఇప్పటి పరిస్థితుల్లో ఇంతకంటే మెరుగైన బడ్జెట్‌ను రూపొందించడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి రోశయ్య స్వయంగా అంగీకరించడం రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులకు అద్దం పడుతుంది.

పి.అరుణకుమారి, నెల్లూరు.

### నియంతృత్వ ధోరణి తగదు!

ప్రత్యేక తెలంగాణ వుద్యమానికి దారి తెన్ను లేకుండా పోతుంది. ఉస్మానియా యూనివర్సిటీలోని విద్యార్థులు తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలని, మంత్రులు తమ పదవులు వదులుకోవాలని ముల్లాల మాదిరి ఆదేశాలివ్వడం సరికాదు. కేంద్రం వేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా తాము చెప్పినట్లు వినాలనడం శోచనీయం. ఇప్పటికే ముంబాయిలో బాల్‌థాకరే, జార్ఖండ్‌లో శిబుసోరేన్, తెలంగాణలో కెసిఆర్‌కు తోడుగా ఉస్మానియా విద్యార్థి జెఏసి నాయకులు నియంతలను తలపించడం శోచనీయం.

కె.పెంచలయ్య, కొడవలూరు.

### ముస్లింలను ఆదుకోండి!

రాష్ట్రంలో మెజార్టీ శాతం మంది ముస్లింలు దైన్యస్థితిలో వున్నారు. ఈ విషయాన్ని ఎన్నో కమిటీలు నిర్ధారించాయి. కాని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా ముస్లింలకు ఇచ్చిన నాలుగుశాతం రిజర్వేషన్లను హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. తమిళనాడులో ఐదు, పశ్చిమబెంగాల్‌లో 10శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అమలవుతున్నాయి. రాష్ట్రంలో మాత్రం సరైన రాజకీయ అండలేక ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రోశయ్య, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఎమ్పీలు ఈ విషయమై స్పందించి పార్లమెంటులో ప్రత్యేక చట్టం ద్వారా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించమనవి.

ఎస్.ఎం.బాషామొహియుద్దీన్, నెల్లూరు.

## 70 ఏళ్ల క్రితం ఈవారం

1-3-1940
పేజీలు : 16 వెల: అణా

### కొండ్లపూడి ఆదిశేషారెడ్డి విచిత్ర దావా

మద్రాసు హో అండ్ కో కంపెనీ వారు ప్రచురించిన 1940 డైరీని నెల్లూరులోని వారి ఏజెంటు వద్ద ఆదిశేషారెడ్డిగారు 1-1-1940తేదీన కొన్నదానిలో తెలుపబడిన కొన్ని విషయాల్లో తప్పులు వుండినాయట. మంత్రులు అధికారంలో లేకుండినను వున్నటుల వున్నదట. ప్రభుత్వం అడ్వైజరి కౌన్సిల్ ద్వారా నడపబడుచున్నటుల లేదట. 1940లో అధికారం లేకపోయినా మద్రాసు కమిషనరుగా ఆర్.సుబ్బయ్య నాయుడుగారు, మేయరుగా వెంకటరత్నం నాయుడు గారలు అధికారంలో వున్నటుల వున్నదట. గవర్నరుగారి పేరు కూడా తప్పు వుండినదట. తప్పులు వుండి నందు వలన హో అండ్ కో వారు తమ డైరీని వాపసు చేయాలనీ, డైరీలో తెలుపబడిన పొరపాటు విషయాలు గూర్చి సరియైన యదార్థం కనుగొనుటకు గాని రెడ్డి గారి కాలం వృథా పుచ్చబడినందుకు నష్టానికి 500లకు రెడ్డి గారు దావా నోటీసులను 1-1-40 తేదీన హో అండు కో వారికి యిచ్చాడు. ఈ నోటీసుకు కంపెనీవారి అడ్వకేటు ద్వారా యిచ్చిన జవాబు తృప్తికరంగా లేనందున శేషారెడ్డి గారు 22-2-40తేదీన నెల్లూరు మునసబు కోర్టులో డైరీ ఖరీదు రు 0-11-0లకు నష్టం క్రింద రూ 500లకు గాక రు 4-5-0లకు దావా దాఖలు చేశాడు.

### బెంగాలు ప్రభుత్వ చర్యను ఖండించుట

నెల్లూరు జిల్లా జర్నలిస్టు సంఘం వారు 25-2-40 తేదీన నెల్లూరులో లా జర్నలు పత్రికా కార్యాలయంలో సమావేశమై కలకత్తాలో దైనిక పత్రిక, హిందూస్థాన్ స్టాండర్డు మూడునెలల వరకు సంపాదకీయ వ్యాసాలను ప్రచురణకు ముందుగా ప్రెస్ అడ్వయిజరుకు చూపవలెననే ఉత్తర్వు అగౌరవమైందని తీర్మానం గావించారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

26-2-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### మళ్లీ కాంగ్రెస్‌లో చెన్నారెడ్డి, ఓబులరెడ్డి

శాసనసభ్యులు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి, బొమ్మకంటి సత్యనారాయణ, అరిగె రామస్వామి, శ్రీనివాసరావు, డి.హనుమంతరావు, కందుల ఓబులరెడ్డి, డివి. సుబ్బారెడ్డి; కౌన్సిల్ సభ్యుడు చిన్నశివారెడ్డి గారలు తిరుగా కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో మొదటి ఐదుగురు తెలంగాణావారు; తక్కిన ముగ్గురూ ఆంధ్రజిల్లాలవారు. వీరందరూ స్వతంత్ర పార్టీ వారు. వీరి పునః ప్రవేశంతో తెలంగాణాకు సంబంధించి స్వతంత్ర పార్టీ శాసనసభ్యులొక్కరూ లేకుండా పోయారు.

### కరణీకం: మనుమళ్లకు వారసత్వపు హక్కు!

ఆఖరు పురుష వారసుని కూతురు బిడ్డకు కరణీకానికి వారసత్వ హక్కు గలదని ఆంధ్ర హైకోర్టు తీర్పు యిచ్చింది. కర్నూలు జిల్లా చిన్నహూతూరు గ్రామకరణం చనిపోగా, ఆ వుద్యోగానికి, అతని ఆఖరు పురుష వారసుని కుమార్తె బిడ్డయిన నాగేశు అను అతనికి వారసత్వపు హక్కులేదని, రెవిన్యూబోర్డు ఆఖరు పురుష వారసుని సోదరుని కుమారునికి వుద్యోగం ఇచ్చింది. దాని మీద నాగేశు తండ్రి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా, వారసత్వపు చట్టంలోని 10(2), 10 1(ఏ) సెక్షన్లు రెండు కలిస్తే స్త్రీ గాని లేక ఆఖరు పురుష వారసుని మనుమలు వుద్యోగానికి అర్హులు గారని చెప్పుటకు వీలు లేదని న్యాయమూర్తులు తీర్పులో వెలిబుచ్చారు.

### సరస్వతి రంగస్వామి అయ్యంగారు కాలధర్మం

ప్రతిభావంతుడైన రంగస్థలనటుడుగా, సినిమా నటుడుగా పేరుపొందిన సరస్వతి రంగస్వామి అయ్యంగారు 24తేది రాత్రి నెల్లూరులో కాలధర్మం చెందారని తెల్పుటకు చింతిస్తున్నాం. ఆయన మరణంతో ఆంధ్రదేశం, ముఖ్యంగా నెల్లూరు మండలం ఒక వుత్తమనటుని కోల్పోయింది.

# ప్రజల పట్ల మర్యాద చూపండి!

## పోలీసు అధికారులకు ఎస్పీ సూచన



ఎస్పీ దామోదర్.

ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఇ.దామోదర్ నెల్లూరు సిటీ, రూరల్ సబ్ డివిజన్లలోని వివిధ విభాగాల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో వున్న సమస్యలను ఆరా తీసి వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ట్రాఫిక్, దొంగతనాలు, దోపిడీలు, శాంతిభద్రతల వ్యవహారాలను పరిశీలించారు. విధి నిర్వహణ సక్రమంగా చేయమని పోలీసు అధికారులను కోరారు. పెండింగ్ కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించమన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి అనంతరం వారి సమస్యలు పరిష్కరించమన్నారు. ట్రాఫిక్ పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహిస్తే నగరంలో ఈ సమస్య పరిష్కరించవచ్చున్నారు. స్టేషన్‌కు అనవసరంగా వ్యక్తులను తీసుకొచ్చి వేధింపులకు గురి చేయవద్దన్నారు. నగరంలో పగలు, రాత్రుళ్లు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టమని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో నగర డిఎస్పీ రాధిక, సిఐ వీరాంజనేయరెడ్డి, ట్రాఫిక్ సిఐ రాఘవరావు, క్రైం సిఐ మురళీకృష్ణ, బాలాజీనగర్ సిఐ శరత్‌బాబు, నగరంలోని అన్ని స్టేషన్ల ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ధాన్యానికి మద్దతు ధర ఇవ్వండి!



జిల్లా కలెక్టర్ రాంగోపాల్ సలహా.

రైతుల కష్టాలను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో ఆలోచించి వారికి కనీస మద్దతు ధర ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ మిల్లర్లను కోరారు. గోల్డెన్ జూబ్లీ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఈమధ్య ఎక్కువగా తింటున్న జిలకర మసూరి పంట ఈ నెలాఖరుకు 30 శాతం మార్కెట్‌లో విక్రయానికి వస్తుందని, దీనిపై నల్లమచ్చలు వచ్చాయని కొనుగోలుకు ఎఫ్‌సిఐ కూడా వెనకడుగు వేయడం మంచిది కాదన్నారు. ఎఫ్‌సిఐ ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తే తిరిగి తాము దాన్ని బియ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో వినియోగించుకొంటామన్నారు. ఈ రకానికి కనీస మద్దతు ధర చెల్లించమని మిల్లర్లను కలెక్టర్ కోరారు. రైసుమిల్లర్ల నాయకుడు రంగయ్యనాయుడు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ నుంచి నెల్లూరుకు వస్తున్న బియ్యాన్ని రాకుండా చూడాలన్నారు. ఎఫ్‌సిఐకి కోట్ల మేర ధాన్యం నిలువచేసే శక్తి వున్నా వెనుకంజ వేయడం బాధాకరమన్నారు. జిల్లాలో రైతుల పరిస్థితిని దృష్టిలో వుంచుకొని కనీస మద్దతు ధర ఇచ్చి జిలకరమసూరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, ఎఫ్‌సిఐ మేనేజర్లు కమలాకర్, డేవిడ్, విజయ్, వ్యవసాయ శాఖ జెడి బాలయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# మేయర్‌ను నిలదీసిన మహిళలు

కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో మేయర్ భానుశ్రీ ప్రతినిత్యం నగరంలోని రెండు మూడు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సిపిఎం పార్టీ బలంగా వున్న వెంకటేశ్వరపురానికి పర్యటనకు వెళ్లిన మేయర్‌కు

**వెంకటేశ్వరపురంలో వెనక్కు తిరిగిన భానుశ్రీ**

చేదు అనుభవం ఎదురయ్యింది. ఈ ప్రాంతానికి చెందిన పొదుపులక్ష్మి గ్రూపులకు చెందిన మహిళలు తమకు రుణాలు, గ్యాస్ సిలిండర్లు సరిగా అందడం లేదని మేయర్‌ను నిలదీశారు. దీంతో మార్గాంతరం లేని మేయర్ స్థానిక కార్పొరేటర్ కత్తి శ్రీనివాసులును శరణు వేడారు. ఆయన పనిలో పనిగా కాంగ్రెస్ నాయకులు గ్యాస్ సిలిండర్లు అమ్ముకొంటున్నారంటూ విమర్శలకు దిగారు. మేయర్ ఇది నిజమా అంటూ మహిళలను తిరిగి అడిగేసరికి వాళ్లు నిజమని చెప్పడంతో మేయర్ కంగుతిన్నారు. ఆ ప్రాంత పర్యటనను అర్థాంతరంగా ముగించి వెనుతిరిగి వచ్చారామె.

సమాచార చట్టం

# పటిష్టతకు పాటుపడండి!



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి.

రాష్ట్రంలో సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తున్న రాష్ట్ర కమిషనర్ దిలీప్‌రెడ్డిని జిల్లా సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో 19వ తేది సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు సమాచారాన్ని అందించడంలో ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచారహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. నిర్దేశించిన సమయం లోపల ప్రజలకు సమాచారాన్ని అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రికార్డులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సమాచారం అందించడంలో అధికారులు జాప్యం చేయకుండా నిర్దేశించిన వ్యవధి లోపల అందించాలన్నారు.

# మంచి పనిలో రాజీవ్‌భవన్!

## దోమల నిర్మూలనకు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు.

నెల్లూరు నగరంలో దోమల నిర్మూలనకు కాలువలు, గుంటల్లో లక్ష ఆయిల్ బాల్స్ వేసే పనికి రాజీవ్‌భవన్ శ్రీకారం చుట్టింది. మూలపేట కోనేటిమిట్టలోని కోనేరులో మొదటగా ఆయిల్ బాల్స్‌వేసి ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే తాము అందుబాటులోనికి తెచ్చిన ఫాగింగ్ మిషన్ 20 డివిజన్‌లలో తిరిగిందన్నారు. మరో వారంలో నగరమంతా ఫాగింగ్ పూర్తవుతుందన్నారు. పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లలోని మురుగు గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా దోమల నివారణకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఛైర్మన్ రూప్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.పి.చెన్నారెడ్డి, సయ్యద్ తారిఖ్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రక్కన కోనేరులో ఆయిల్ బాల్స్ వేస్తున్న రాజీవ్‌భవన్ నిర్వాహకులు.

# ముస్లిం ప్రదర్శన

## రిజర్వేషన్లపై పార్లమెంటులో చట్టం చేయాలి



ప్రదర్శనలో మాట్లాడుతున్న మతపెద్ద అబూబకర్.

ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ 19వ తేది నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద ముస్లిం సోదరులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత ప్రసంగీకుడు అబూబకర్ మాట్లాడుతూ ముస్లింలకు రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. మత ప్రాతిపదికన కాకుండా వెనుకబడినతనం ఆసరాగా ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. రిజర్వేషన్లపై హైకోర్టులో వచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో పకడ్బందీగా పిటిషన్ వేయను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు హుస్సేనీ, కార్పొరేటర్ సందాని బాష, సిపిఎం నేత కరీముల్లా, షఫీ పలువురు మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం నమాజు తర్వాత జరిగిన ఈ కార్యక్రమానికి నగరంలోని ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## • వివేకా వ్యంగ్య వ్యాఖ్యానాలు తట్టుకోలేక

# సెలవుపై వెళ్లిన ఎస్‌ఐ


వివాదాలకు నిలయం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్. ఇన్‌సెట్‌లో సెలవుపై వెళ్లిన వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసన్.

**నెల్లూరు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసన్ తాను చెప్పినట్లు వినడం లేదని అతడ్ని వెకిలిమాటలతో పదుగురిలో అవమానించి సెలవుపై వెళ్లేట్లు చేశారు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి.**

చట్టాన్ని పరిరక్షించి, శాంతిభద్రతలను కాపాడాలనుకొనే వారిపై సైతం రాజకీయనీడలు అలుముకుంటున్నాయి. నేరారోపణలు ఎదుర్కొనే ఏ వ్యక్తినైనా అరెస్టు చేసే అధికారం పోలీసులకుంటుంది. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించేవారు రాజకీయ అధికారానికి ఏదో ఒకరోజు తలవంచక తప్పడం లేదు. ఉన్నతస్థాయిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సైతం రాజకీయ నేతల మాటలకు విలువనివ్వడం వల్ల క్రిందిస్థాయి అధికారులు, సిబ్బంది సక్రమంగా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారని ఇటీవల కాలంలో పలు సంఘటనలు బహిర్గతం చేశాయి. ప్రధానంగా రాజకీయనేతలు తమ అధికార బలాన్ని పోలీసు, రెవెన్యూ శాఖలపై చూపించి, మాట ధిక్కరించిన వారిని ఏదో ఒకవిధంగా ఇబ్బంది పెడుతుంటారు. ఇటువంటి సంఘటన క్రమశిక్షణ కల్గిన పోలీసుశాఖలో చోటు చేసుకొంది.

### వన్ టౌన్‌లో బాధ్యతల నిర్వహణ కష్టం

నెల్లూరు ఒకటవ నగర పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించడం మిగతా స్టేషన్లతో పోల్చుకొంటే కష్టంగా వుంటుంది. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల సమస్య తీవ్రంగా వుంటుంది. రౌడీషీటర్లు, నేరస్తులు అధికంగా వున్న ఈ స్టేషన్ పరిధిలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అల్లర్లు, దొంగతనాలతో పాటు ఘర్షణలు చోటుచేసుకుంటుంటాయి. యిన్ని సమస్యలను పరిష్కరించి శాంతిభద్రతలను కాపాడాలని చురుకైన, కఠినంగా వ్యవహరించే ఎస్‌ఐని నియమిస్తుంటారు ఆ శాఖాధికారులు. ఉదాసీనతగా వ్యవహరించే ఏ ఎస్‌ఐ అయినా కొద్దినెలలకే అధికారులతో చీవాట్లు తిని బదలీ కావాల్సి వుంటుంది. అందువల్ల ఒకటవ నగర పోలీసు స్టేషన్‌కు కఠినంగా వ్యవహరించే వారిని గుర్తించి ఎస్‌ఐగా నియమిస్తుంటారు.

విధి నిర్వహణలో నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించేవారు ఎవరు కూడా రాజకీయ నేతలకు మింగుడుపడరు. ఎందుకంటే రౌడీ షీటర్లు, భూకబ్జాదారులు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నేతలకు అనుచరులుగా మెలగుతుంటారు. ఒకటవ నగర పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువ సంఖ్యలో ముస్లింలు నివాసం వున్నారు. రౌడీషీటర్లు చేసిన నేరాల నుంచి బయటపడేందుకు చోటా నాయకులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని ఆశ్రయించి పోలీసులపై ఒత్తిడి తీసుకొస్తుంటారు. ప్రతి కేసులోనూ నిందితులపై కేసు లేకుండా వదిలేయమని ఒత్తిడి రావడంతోపాటు ఉన్నతాధికారులకు అవాస్తవ ఫిర్యాదులు చేయడంతో మానసికంగా తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోతున్నారు. ఇందుకు ఉదాహరణ ఎస్‌ఐ శ్రీనివాసన్‌ను పేర్కొనవచ్చు.

### వివేకా వత్తిళ్లు

నగరంలోని నీలగిరిసంఘంకు చెందిన చిన్నబ్బయ్య సుబ్బయ్య అనే వ్యక్తిపై హత్యాయత్నం చేశాడు. సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు నిందితుడు చిన్నబ్బయ్యపై 307 కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు యూత్ కాంగ్రెస్ నేత శ్రీకాంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని ఆశ్రయించి 307కు బదులు 324 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేయించాలని ఎస్‌ఐ శ్రీనివాసన్‌పై ఒత్తిడి చేయించాడు. కేసు విచారణలో ఎస్‌ఐ ఎమ్మెల్యే ఒత్తిడికి లొంగకపోవడం వల్ల అనేకసార్లు ఫోన్ చేసి వివిధ రకాలుగా ఇబ్బందివడే విధంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. మూలాపేట శివాలయంలో హుండీల దొంగతనం సందర్భంగా తారసపడిన ఎస్‌ఐని ఎమ్మెల్యే బహిరంగంగా అవమానకరంగా మాట్లాడడం జరిగింది.

ఈ కేసులోని నిందితుడు చిన్నబ్బయ్యపై ఒకటవ నగర పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ కూడా వుంది. అలాగే నాల్గవ నగర పోలీసు స్టేషన్‌లో కూడా 324, 307 సెక్షన్ల క్రింద కేసులు వున్నాయి. గత నెలలో రిలయన్స్ వెబ్ వరల్డ్‌పై జరిగిన దాడి కేసుకు సంబంధించి కూడా ప్రధాన నిందితుడిగా వున్న ఆసిఫ్‌పాషాపై బెయిలబుల్ సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేయాలంటూ ఎమ్మెల్యే ఇదే ఎస్‌ఐపై ఒత్తిడి తీసుకొచ్చాడు. అయితే ఎమ్మెల్యే మాట ఏ మాత్రం ఖాతరు చేయకుండా నాన్ బెయిలబుల్ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి అరెస్టు కూడా చేయడం జరిగింది. ఎస్‌ఐ తన మాట ఏ మాత్రం వినడం లేదన్న విషయాన్ని మనసులో వుంచుకొని కనిపించిన ప్రతిచోటా ఏదో ఒక సాకుతో అవమానకరంగా తనదైన శైలిలో వ్యాఖ్యలు చేసేవాడు.

ఇటీవల నెల్లూరు నగరంలో దోపిడీలు జరుగుతున్న విషయం తెలిసిందే. వాటి విషయమై చర్చించేందుకు అప్పటి ఎస్పీ మల్లారెడ్డి ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ చర్చల్లో కూడా ఎస్‌ఐ శ్రీనివాసన్ గురించి ఎమ్మెల్యే ప్రస్తావన చేసినట్లు తెలిసింది. తనమాట ఏ మాత్రం ఖాతరు చేయని ఎస్‌ఐని వెంటనే బదలీ చేయమని ఎస్పీని కోరినట్లు ప్రచారం వుంది. ఈ విషయంలో ఎస్పీ మల్లారెడ్డి ఎటువంటి హామీ ఇవ్వలేకపోయారు. విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే శ్రీనివాసన్‌పై వివిధ రకాల ఒత్తిడులు రావడం వల్ల ఎవరికీ చెప్పకోలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు.

### శ్రీనివాసన్ గట్టి పోలీసు!

పోలీసు శాఖలో శ్రీనివాసన్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు వున్నాయి. జిల్లావ్యాప్తంగా జరిగిన వివిధ దొంగతనాల కేసులను అనతికాలంలోనే ఛేదించగలిగారు. వింజమూరు మండలం చాకలికొండలో గ్రామీణ బ్యాంకు దోపిడీ కేసులో నిందితుల్ని పట్టుకునేందుకు శ్రీనివాసన్‌ను నియమించారు. కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ తక్కువ వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసి దోపిడీకి గురైన నగదును స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలాగే వెంకటగిరిలో పనిచేస్తున్న సమయంలో కూడా వెంకటగిరి రాజాల నివాసంలో జరిగిన దోపిడీ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయగలిగారు. ఎర్రచందనం స్మగ్లర్లను చెన్నై వెళ్లి అరెస్టు చేసి జిల్లాకు తీసుకవచ్చారు. ఇన్ని కేసుల్ని ఛేదించిన శ్రీనివాసన్‌పై ఆ శాఖ అధికారులు ప్రశంసలు కురిపించారు.

వెంకటగిరి, కావలి, నెల్లూరు 2వ, 5వ నగర పోలీసు స్టేషన్లలో బాధ్యతలు నిర్వహించిన ఎస్‌ఐ శ్రీనివాసన్‌పై ఎక్కడా అవినీతి ఆరోపణలు రాకపోగా, అధికారుల్లో మంచిపేరు సంపాదించుకున్నారు. నెల్లూరు ఒకటవ నగర పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా ఇంతకు ముందు పనిచేసిన వీరేంద్రబాబుపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ని బదలీ చేసి శ్రీనివాసన్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన కొద్ది నెలలకే ప్రజాప్రతినిధుల మాట వినడంలేదన్న విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. త్వరలో ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి లభించే జాబితాలో శ్రీనివాసన్ వుండడంతో ప్రజాప్రతినిధులతో ఎందుకొచ్చిన వివాదం అనుకొని సెలవు పెట్టి వెళ్లారు.

జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పోలీస్ శాఖలో లేకపోలేదు. ఇటువంటి వారి వల్ల ప్రజలకు ఇబ్బంది కలగడంతోపాటు పోలీసుశాఖకు సైతం చెడ్డపేరు వస్తోంది. ఉన్నతాధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదు. విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించేవారిని అభినందించడంతోపాటు రాజకీయ, అధికారబలాన్ని ఉపయోగించేవారిని దూరంగా వుంచితే మంచిది.

### 5వ నగర పోలీస్ స్టేషన్‌లో పరిస్థితులు ఘోరం!

నెల్లూరు నగర శివారులో వున్న 5వ నగర పోలీసు స్టేషన్ పరిస్థితి ఘోరంగా తయారయ్యింది. మామూళ్ల వసూలు చేయడంలోనే ఇక్కడి సిబ్బంది నిమగ్నమైపోయారు. ఇంతకు ముందు మూడవ నగర పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన శ్రీనివాసరెడ్డిని 5వ నగర పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు. ఇటీవల బదలీ అయిన ఎస్పీ మల్లారెడ్డి ఒక సామాజికవర్గానికే ప్రాధాన్యతనిస్తూ వచ్చాడన్న అభిప్రాయం ఆ శాఖలో వుంది. జాతీయ రహదారి ఈ స్టేషన్ పరిధిలో వుండడంతో ఇసుక లారీలు కూడా ఈ స్టేషన్‌వైపు వెళ్తుండడంతో భారీ స్థాయిలో ముడుపులు అందుతున్నాయి. 3వ నగర పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో తనకు సన్నిహితంగా వుంటున్న ఇద్దరు కానిస్టేబుళ్లను కూడా 5వ నగర పోలీసు స్టేషన్‌కు బదలీ చేయించుకున్నారు. ఇసుక లారీల నుంచి రోజు వారి మామూళ్లకు బదులు నెలసరి మామూళ్ల ఇచ్చేవిధంగా ఒప్పందాలు జరిగినట్లు తెలిసింది. బదలీపై వచ్చిన తన సన్నిహితుల ద్వారా డాబా హోటళ్ల నుంచి మామూళ్ల వసూలు చేయిస్తున్నట్లు అదే స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది గుసగుసలాడుతున్నారు. 3వ నగర పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఎస్‌ఐ శాంతిభద్రతలను కాపాడలేకపోయారన్న ఆరోపణలు వచ్చాయి.

మొత్తం మీద ఇటీవల కాలంలో జిల్లాలో పోలీసు శాఖ ప్రతిష్ట కొంతమేర దిగజారిపోయింది. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిని అందలమెక్కించడం, కఠినంగా వ్యవహరించేవారిని ఇబ్బంది పెట్టడం వంటి సంఘటనలు ఆ శాఖలో చోటు చేసుకుంటున్నాయి.



గూడూరు సహాయ కార్మిక కమిషనర్ రాచపాళెం రఘు రచించిన ప్రాసబాసలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బివి.నరసింహం, మేయర్ భానుశ్రీ, అన్నపూర్ణ తదితరులు.



నెల్లూరు బాలాజీగ్రూప్ వార్షికోత్సవ సంబరాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఆ గ్రూప్ అధినేతలు వైడి.బాలాజీచౌదరి, ఆయన సతీమణి ప్రవీణ.




ధరల పెరుగుదలపై సిపిఎం, సిపిఐ పార్టీల నేతృత్వంలో జరిగిన ప్రజా సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టిపి.భానురాజు.



ప్రణమిల్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోమతి హైస్కూల్ అధినేత పి.అరుణ. ప్రక్కన పెరుగు రామకృష్ణ, పుస్తక రచయిత మధుసూధనరావు, పెంచలనరసింహం, గుండాల నరేంద్రబాబు.

## పడిగొట్టే భవనాలకు నిధులు

● వెంకటాచలం మండలంలో విచిత్రం

రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించే భవనాల మరమ్మత్తులకు లక్షల రూపాయలు ఖర్చు పెడుతూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్న వైనం వెంకటాచలం మండలంలో జరుగుతోంది. జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించేందుకు అధికారులు స్థలాన్ని సేకరించారు. ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే నిబంధనలు పట్టించుకోకుండా దొడ్డరాజుపాళెం గ్రామంలో గతంలో తొలగించిన పాఠశాల భవనాన్ని ఆధునీకరించేందుకు మండల సర్వసభ్య సమావేశంలో 50వేల మంజూరు చేశారు. భవనం పూర్తిగా పోతుందని తెలిసినా నిధులు మంజూరు చేయడంలో ఆంతర్యం ఏమిటో పాలకులకే తెలియాలి. చవటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘానికి తహశీల్దార్ కార్యాలయం ప్రక్కనే ఇరిగేషన్ స్థలాన్ని కేటాయించారు. అక్కడ 10లక్షలతో ఐసిడిపి క్రింద నిర్మాణాలు చేపట్టారు. ఒక వైపు రోడ్డు విస్తరణకు సర్వే జరుగుతుంటే మరోవైపు భవనాల నిర్మాణాలు, మరమ్మత్తులు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● మనుబోలులో

## మానిపండు తెగులు!

### తగ్గుతున్న వరి పంట దిగుబడి

మనుబోలు మండలంలో వరిపంటకు మానిపండు తెగులు ఉధృతంగా సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగులు ప్రధానంగా జిలకర మసూరి, నెల్లూరు మసూరిలకు ఎక్కువగా సోకుతున్నట్లు రైతులు చెప్తున్నారు. మండల పరిధిలోని బండేపల్లి, కాగితాలపూరు, లక్ష్మీనరసాపురం, అక్కంపేట, బద్దెవోలు, పిడూరుపాళెం, కట్టువపల్లి, కొలనుకుదురు తదితర గ్రామాల్లో సాగు చేసిన వరిపంటకు మానిపండురావడంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ తెగులు సోకడం వలన పంట దిగుబడి తగ్గిపోవడం, ధాన్యం నాణ్యత దెబ్బతింటుండడంతో సాగుచేస్తున్న అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఇటీవల వరకు తెల్ల తెగులు, పాముపొడ, అగ్గితెగుళ్లతో విసిగిపోయిన రైతులకు ఈ మానిపండు తెగులు గుబులు పుట్టిస్తోంది. పంట చివరి దశలో శిలీంధ్రాల మూలంగా ఈ తెగులు వ్యాపిస్తుందని, మొదట తెల్లగా మొదలై ముదురాకు పచ్చ, పసుపు రంగుల్లోకి మారుతుందని చెప్తున్నారు వ్యవసాయాధికారులు. దీని నివారణకు ఒక గ్రాము కార్బన్‌డిజంను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచిస్తున్నారు.

## రూరల్‌లో క్షీణించిన పారిశుద్ధ్యం!

● పట్టించుకోని వివేకా

రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, రోడ్లపైకి పొంగుతున్న మురికినీరు, పందుల స్వైర విహారం ప్రజలను రోగాల బారిన పడవేస్తున్నాయి. ఆ గ్రామం, ఈ గ్రామం అని తేడా లేకుండా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుండడంతో ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి గ్రామాలు. సర్పంచ్‌లు, అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు తప్పితే పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోకపోవడంతో రూరల్ మండలంలో పారిశుద్ధ్యం పాతర వేసింది. పారిశుద్ధ్యానికి అరకొర నిధులు అందజేస్తుండడంతో పూర్తిస్థాయిలో సమస్యలను పరిష్కరించ లేకపోతున్నట్లు సర్పంచ్‌లు చెప్తున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయితీల్లోని షుమారు 60 గ్రామాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా వెల్లంటి, గొల్లకందుకూరు, ములుమూడి, కొమ్మరపూడి, కొండ్లపూడి, నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు, కల్లూరుపల్లి, బుజబుజనెల్లూరు, ఆమంచర్ల పంచాయితీలలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## కుదేలైన పోస్టల్‌శాఖ

ముత్తుకూరు మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంటే తపాలా శాఖ కార్యకలాపాలు మాత్రం రోజురోజుకు వెనుకబడుతున్నాయి. ఎన్నో పనులకు అవసరమైన రెవెన్యూ స్టాంపులకు మండలంలో కొరత ఏర్పడింది. ఏ పోస్టాఫీసులోనూ ఈ స్టాంపులు దొరక్కపోవడంతో వివిధ అవసరాల కోసం స్టాంపులు కావలసినవారు అవస్థలు పడాల్సి వస్తోంది. రెవెన్యూ స్టాంపుల కొరత గత కొంతకాలంగా మండలంలో ఏర్పడినా పోస్టల్ అధికారులు వాటిని సరఫరాచేయడంలో తగిన శ్రద్ధ వహించకపోవడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పోస్టాఫీసుల్లో దొరకని రెవెన్యూ స్టాంపులు బయట వ్యాపారస్తుల వద్ద మాత్రం అందుబాటులో వుండడం విశేషం. బ్లాక్‌లో వీటిని విక్రయిస్తూ వ్యాపారులు లాభార్జన చేస్తున్నారు. తపాలా కార్యాలయాల్లో దొరకనివి వ్యాపారుల వద్ద మాత్రం అవసరమైనన్ని వుండడం ప్రజలను విస్మయపరుస్తోంది.

## క్వారీలలో పేలుళ్లు!

గూడూరు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో క్వారీల నిర్వాహకులు చేస్తున్న బ్లాస్టింగ్‌లతో ప్రజలు హడలిపోతున్నారు. ఇళ్ల గోడలు బీటలు వారడం, భూమి కంపిస్తుండడం, కిటికీల అద్దాలు పగిలిపోతుండడంతో గ్రామాలను వదలి వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా గూడూరు మండలంలోని కుందకూరు, కాండ్ర, వెందోడు, సైదాపురం మండలాల్లోని చాగణం, రాపూరు మండలంలోని పులిగిలపాడు, మనుబోలు మండలంలోని వడ్లపూడి, ఓజిలి మండలంలోని వీర్లగునపాడు గ్రామాల్లో పలువురు క్వారీలను నిర్వహిస్తున్నారు.

### 15కుపైగా గ్రామాల్లో ఇళ్లకు బీటలు

వీటిలో అధికభాగం కుందకూరు గ్రామంలో వున్నాయి. క్వారీలలోని బండరాళ్లకు డిమాండ్ ఏర్పడడంతో నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. డ్రిల్లింగ్ పద్ధతిలో కాకుండా బోరు యంత్రాలతో బ్లాస్టింగ్ చేస్తుండడంతో ఆ శబ్దాలకు, ప్రకంపనలకు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శబ్దాల తాకిడికి పలువురు వినికిడి శక్తి కోల్పోయారు. గృహాలు దెబ్బతింటున్నాయి. పశువులు ఆ శకలాలు తినడం వలన రోగాలబారిన పడుతున్నాయని, సేద్యాలు సాగక దిగుబడి తగ్గిపోతున్నాదని రైతులు వాపోతున్నారు.



నెల్లూరులోని అమూల్య స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో ఎస్‌సి బాలికల వసతి గృహంలో పరీక్ష అట్టలు, నోటు పుస్తకాలు పంచుతున్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసకుమార్. ప్రక్కన సేవా సంస్థ నిర్వాహకుడు టోని, కృష్ణయాదవ్ తదితరులున్నారు.

# తోటపల్లిగూడూరులో ఐటిడిఏ స్కూల్!

**ఆదాల కృషి ఫలితం**

తోటపల్లి గూడూరు మండలం మల్లిఖార్జునపురంలో ఐటిడిఏ ద్వారా హాస్టల్, స్కూలు భవనాన్ని ఏర్పాటు చేయనున్నారు. సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ గ్రామంలో 39మందికి ఆదాల ట్రస్టు, ఐటిడిఏ ద్వారా రెండు లక్షల రూపాయలు విలువ చేసే కుట్టుమిషన్లు, లక్షా తొమ్మిది వేల రూపాయలు స్టైఫండ్ పంపిణీ చేశారు. రేషన్‌కార్డుల తొలగింపులో అర్హులకు నష్టం కలగని విధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. మల్లిఖార్జునపురానికి వాటర్‌ట్యాంకును మంజూరు చేస్తున్నట్లు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మండలంలో పొలాల రేట్లు పెరిగినందువల్ల రైతాంగం మంచిస్థితిలో వుందన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి టంగుటూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ యాష్‌పాండ్ పరిహారం చెల్లింపులో లబ్దిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఐటిడిఏ పివో రమేష్, విజయడైరీ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, జాఫర్‌సాహెబ్ కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ దువ్వూరు సురేంద్రనాథ్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో ఆదాల ట్రస్ట్ తరఫున మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి. ప్రక్కన విజయా డైరీ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి.

# ఒకటిన్నర లక్ష తిన్న మోటివేటర్!

**• పొదుపు సంఘాల్లో అవినీతి పర్వం**

పొదుపు సంఘాలను, సభ్యులను చైతన్య పరచాల్సిన మోటివేటర్ వారికి తెలియకుండానే నగదు స్వాహా చేసిన వైనం తోటపల్లిగూడూరులో చోటు చేసుకొంది. మండల కేంద్రంలో మహిళా బ్యాంకు మోటివేటర్‌గా వున్న వంగూరు పద్మావతి తన మాటకారితనం వల్ల మహిళా సంఘాలను సంఘటిత పరచడంలో గుర్తింపు పొందింది. అధికారుల వద్ద పేరు సంపాదించుకొంది. ఆమె కొంతకాలం క్రిందట మోటివేటర్‌గా రాజీనామా చేసి వేరే సంస్థలోకి వెళ్లింది. సౌత్ ఆములూరుకు చెందిన శుభోదయ, ఉషోదయ, చైతన్య, లక్ష్మిగ్రూపుల సభ్యులు ఇందుకూరుపేట స్టేట్‌బ్యాంకుకు నోడ్యూస్ సర్టిఫికేట్ కోసం వెళ్లగా తోటపల్లిగూడూరు మహిళా బ్యాంకు మేనేజర్ సభ్యులు రూ.1.56 లక్షలు బాకీ వున్నారని చెప్పడంతో సభ్యులు విస్తుపోయారు. దీనిపై సభ్యులు విచారించగా వారి ప్రమేయం లేకుండానే పద్మావతి నిధులు డ్రా చేసినట్లు వెల్లడైంది. విషయం బట్టబయలు కావడంతో మోటివేటర్ పద్మ ఎంపిడివో సుజాత వద్దకు వెళ్లి నగదు స్వాహా చేశానని ఒప్పుకొని, ఆ మొత్తాన్ని నాలుగు నెలల్లో తిరిగి చెల్లిస్తానని బ్రతిమిలాడుకోవడంతో అధికారులు, సభ్యులు ఒప్పుకొన్నారు.

# అంగన్‌వాడీల్లో అవినీతి!

**ఆత్మకూరులో పరిస్థితిది.**

పేద పిల్లలకు, మహిళలకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు అవినీతి కేంద్రాలుగా తయారవుతున్నాయి. జిల్లాలో పలు అంగన్‌వాడీలలో ఇదే పరిస్థితి నెలకొని వుంది. ఆత్మకూరు ప్రాంతంలోని ఐసిడిఎస్‌లో ఈ అవినీతి అక్రమాలు పెచ్చు మీరుతున్నాయి. పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాలకు చేరకముందే అంగళ్లకు చేరిపోతుంది. ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లోని సూపర్‌వైజర్లు చేతివాటం ప్రదర్శించడంతో పేదలకు అందాల్సిన ఆహారం ప్రక్కదారి పడుతోంది. ఒక్కో సూపర్‌వైజర్ ఈ అక్రమాలకు, అవినీతికి పాల్పడి నెలకు 50వేల రూపాయలు సంపాదిస్తుండగా, సిడిపివోలు, జిల్లా అధికారులకు వచ్చే ఆదాయం చెప్పనవసరం లేదు. దీనిలో ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం వుండడంతో ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పట్టించుకొనే వారు లేకుండా పోయారు. ఆత్మకూరు పట్టణం, సోమశిల సెక్టార్లలోని పెద్ద పెద్ద అంగళ్లు, హోటళ్లతో నేరుగా ఒప్పందం కుదుర్చుకొని సరుకు తరలించి వేస్తుండడం వీరి లెక్కలేనితనానికి నిదర్శనం. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తక్కువగా వుంటే హాజరు పట్టీలో మాత్రం అధిక సంఖ్యలో వుంటుండడం వీరి అవినీతిని తెలియజేస్తున్నది.

**జలదంకి చెరువుల్లో**

# తగ్గిన నీటి మట్టం

మండల కేంద్రమైన జలదంకిలో చెరువుల నీటిమట్టం తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జలదంకిలోని పెద్దచెరువు, లేదోటమ్మ గంగమ్మ చెరువు, టంకవారిపాళెం ఎర్రచెరువుల్లో నీటిమట్టం పడిపోయింది. ఈ చెరువుల క్రింద సాగు చేస్తున్న వరిపైరు పొట్టదశ, లేత వెన్నుదశల్లో వుంది. నీరు పుష్కలంగా వుంటేగాని పంట చేతికొచ్చే పరిస్థితి లేదు.

**ఆందోళనలో అన్నదాతలు**

ఈ సమయంలో చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడం రైతులకు నిద్రలేకుండా చేస్తున్నది. జలదంకి పెద్ద చెరువు క్రింద 2700 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారు. ఇతర చెరువుల క్రింద సాగు అధికంగానే వుంది. పంటలు కాపాడేందుకు అధికారులు సోమశిల జలాలను బ్రాహ్మణక్రాక మేజర్, గౌరవరం మేజర్, కావలి కాలువల ద్వారా నింపాలని, తగినంత నీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుకొంటున్నారు.

# ధ్యానంతో సమస్యలు దూరం!

**• రామచంద్ర మిషన్ స్వామి ఉద్బోధ**

సమాజంలో నెలకొన్న సరుగ్మతలు అసమానతలు తొలగడానికి, మనిషి రాగద్వేషాలు విడనాడడానికి ధ్యానం మంచి మార్గమని రామచంద్ర మిషన్ స్వామి వై.హజరత్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్‌ఎస్ కళ్యాణమండపంలో మిషన్ నిర్వహించిన వ్యాసరచన పోటీలకు ఆయన విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లల్లో ఆధ్యాత్మిక విలువలు పడిపోతున్నాయని ఆవేదన చెందారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు పెచ్చుమీరుతున్నాయని, దీనికి పరిష్కారమార్గం సాటివారి పట్ల ప్రేమ కలిగి వుండడం, భగవంతుడ్ని ఆరాధించడం అని సూచించారు. బుచ్చి, దగదర్తి, సంగం మండలాలకు చెందిన 130 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. రిటైర్డ్ ఎంఇవో కృష్ణవేణి, టీచర్లు వేణుగోపాలరెడ్డి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




బుచ్చిరెడ్డిపాళెంలో శ్రీరామచంద్ర మిషన్ ద్వారా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు పంచుతున్న మిషన్ ప్రతినిధులు గోపాలరెడ్డి, పరమేశ్వరరావు.

# రేషన్‌కార్డులెలా రద్దు చేస్తారు?

**• మండల మీట్‌లో వాడివేడి చర్చ**

రేషన్‌కార్డులు తొలగింపుపై ఇందుకూరుపేట మండల సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. సర్వే పేరుతో అర్హులైన వారి కార్డులు తొలగించడంపై ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మూకుమ్మడిగా లేచి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా కార్డులు తొలగించడం ఏమిటని వారు తహశీల్దార్‌ను నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లు వున్నంత మాత్రన వారికి తిండి అవసరం లేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీనికి తహశీల్దార్ వివరణ ఇవ్వడంతో సభలో ప్రశాంతత నెలకొంది. అనంతరం మండలానికి 108 వాహనాన్ని కేటాయించిన దాత జివికెరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సమావేశం ఆ వాహనం నిలుపుకొనేందుకు స్థలం కేటాయిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. అలాగే దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు సభ ఆమోదముద్ర వేసింది. ఎంపిపి కాసా రాధమ్మ, తహశీల్దార్, ఎంపిడివో తదితరులు పాల్గొన్నారు.



జన్మదినోత్సవ సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న సిఎం రోశయ్య. ప్రక్కన గవర్నర్ నరసింహన్, వెంకయ్యనాయుడు, శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి.



జనార్దనరెడ్డికి కండువా కప్పుతున్న రాజ్యసభ సభ్యుడు కెవిపి. రామచంద్రరావు.



సభకు ముందు కుమారుడు రామ్‌కుమార్, మాజీ డిజిపి ఆంజనేయరెడ్డితో జనార్దనరెడ్డి.



జనార్దనరెడ్డికి శాలువా కప్పి చెవిలో గుసగుసలాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి.

# జన్మంతా గుర్తుండే జన్మదినోత్సవం

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి 75వ జన్మ దినోత్సవం 20తేది హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఘనంగా జరిగింది. ఘనం అనే పదానికి అసలైన నిర్వచనం వలె నడిచింది. జన్మదినోత్సవాలు జరుపుకోవడం జనార్దనరెడ్డికి అలవాటు లేదు. అధికారంలో వున్నన్నినాళ్లు ఆయన ఆ సంబరానికి పూనుకోలేదు. తన జన్మదినం రోజు కొద్దిమంది పేద విద్యార్థులకు బహుమానాలు పంచి పెట్టడం మాత్రమే ఆయనకు అలవాటు. అందుకోసం ఒక నిధి కూడా ఏర్పాటు చేసుకొన్నాడు. కానీ ఈసారి ఆయన అనుచరులు, కుటుంబ సభ్యులు కూడా పుట్టిన రోజును ఒక పండుగగా జరపడానికి ముచ్చటపడ్డారు. ప్రయత్నం చిన్నదే. కానీ ఫలితం మాత్రం వూహించనంత గొప్పగా దక్కింది.

వేదిక మీద దాదాపు పాతిక మంది ముఖ్యులు ఆశీనులైనారు. వారందరూ తమ తమ రంగాలలో లబ్ధప్రతిష్టులు. దాదాపుగా అందరూ జనార్దనరెడ్డి మీద ఆప్యాయత క్రుమ్మరించారు. ఆత్మీయత రంగరించి చిలకరించారు. రెండు గంటల పాటు సభావరణంలో ఆప్యాయతానురాగాలు వర్షించాయి. ఆ హృద్యమైన, సున్నితమైన భావవ్యాప్తికి సభకు వచ్చిన వారంతా పులకరించిపోయారు.

రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్ మదిలో జనార్దన రెడ్డి పట్ల అంత ప్రగాఢమైన అభిమానం గూడు కట్టుకొని వుందని ఎవరూ వూహించలేరు. జనార్దనరెడ్డిని పొగడ్తల పూల జల్లుతో ముద్ద చేశారాయన. తానొక గవర్నర్‌గాకాక, జనార్దన రెడ్డి ఆరాధకుడిగా మాట్లాడుతున్నానని ప్రత్యేకంగా చెప్పడమే కాదు; జనుల ఆరాధనకు నోచుకొన్న జనార్దనరెడ్డి తన పేరు సార్ధకం చేసుకొన్నాడని వర్ణించాడు. ఆయన వంటి ముఖ్యమంత్రిని తాను జీవితంలో మరొకరిని చూడలేదని కితాబిచ్చారు. ముఖ్యమంత్రి రోశయ్య గారు కూడా మనసు విప్పి మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఇదివరకు కానీ, ఇప్పుడు కానీ జనార్దనరెడ్డికి వున్నంత మంది అభిమానులు, అనుచరులు మరొకరికి లేరని వ్యాఖ్యానించాడు ముఖ్యమంత్రి.

ఒక విశేషం, ఈ ఇద్దరు ముఖ్య అతిథులు జనార్దనరెడ్డి కంటే ఎక్కువగా ఆయన సతీమణి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మను ప్రశంసించడం. ఒక రకంగా చెప్పాలంటే కొద్ది సేపు అది జనార్దనరెడ్డి జన్మదినోత్సవం వలె కాక, రాజ్యలక్ష్మమ్మ అభినందన సభ వలె మారిపోయింది.

బిజెపి జాతీయ నేత వెంకయ్యనాయుడు కూడా మనసు విప్పి మాట్లాడారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మూడే ముక్కలలో ముచ్చటగా మాట్లాడారు. ప్రజారాజ్యం చిరంజీవి, సినీనటుడు మోహన్‌బాబు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ వంటి వారంతా జనార్దనరెడ్డితో తమ అనుబంధాన్ని మాటలతో పంచుకొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.వెంకటస్వామి కూడా హృద్యంగా ప్రసంగించారు. సహజకవి మల్లెమాల సుందరరామరెడ్డి పద్యాలతో ఆశీర్వచనాలు చిలకరించాడు.

## జనార్దనరెడ్డి అభిమానులతో కిటకిటలాడిన శిల్పకళా వేదిక

జనార్దనరెడ్డి గారి ప్రసంగం మనసులో నుంచి వచ్చినట్లు వుండింది. యాభైఏళ్ల తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించారాయన. ఇందిరమ్మతో అనుబంధాన్ని నెమరు వేసుకొన్నాడు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గొప్పదనాన్ని ప్రత్యేకంగా చెప్పాడు.

దాదాపు పదిహేను మంది రాష్ట్ర మంత్రులు హాజరైనారు. సాధారణ వ్యక్తుల వలె వేదిక క్రింద కూర్చుని జనార్దన రెడ్డి గారి పట్ల తమకున్న భక్తి ప్రపత్తులు చాటారు. కొన్ని వందల మంది జనార్దనరెడ్డిని పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో సత్కరించారు. మొత్తం మీద సభ చాలా హార్దికంగా, ఆహ్లాదకరంగా సాగింది. ఎప్పుడూ జన్మదినాల వేడుకలకు సాహసించని జనార్దనరెడ్డికి, తతిమా జన్మంతా గుర్తుండి పోయేంత ఆత్మీయంగా నడిచింది.

నెల్లూరు జిల్లాకు సంబంధించి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వర్గ విభేదాలు మరిచి సభ జరిగినంతసేపూ కదలకుండా కూర్చున్నాడు. ఆయన సోదరుడు వివేకానందరెడ్డి మాత్రం సభకు గైర్హాజరై, ఎవరూ చూడకుండా పొద్దుపోయిన తర్వాత ఇంటికి వెళ్లి జనార్దనరెడ్డికే కాక, రాజ్యలక్ష్మమ్మకు కూడా సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. నా రాజకీయం మీరు పెట్టిన భిక్ష కదక్కా అని వినయం నటించాడు. జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్పీలు చింతా మోహన్, పనబాక లక్ష్మి రాజమోహన్‌రెడ్డి ముఖం తప్పించారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క కారణం. తెలుగుదేశానికి సంబంధించి ఎమ్మెల్యేలు ప్రసన్నకుమారరెడ్డి, పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాద్ హాజరు వేసుకొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకరరెడ్డి, మేకపాటి శేఖర్‌రెడ్డి, జిప ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వచ్చారు. ముప్పయ్యేళ్లపాటు రాజకీయ పదవులు, ఆర్థిక ప్రయోజనాలతో జనార్దరెడ్డి పుణ్యాన తన జీవితాన్ని చక్కదిద్దుకొన్న డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాల రెడ్డి మొగమాటానికి ఇంటికి వచ్చి, పూలమాల వేసి రెండోకంటికి కన్పించకుండా మాయమై పోవడం... ఇప్పటి రాజకీయాలలో విశ్వాస విధేయతలు ఎంత బుద్బుద ప్రాయమో అర్థం చేసుకోవడానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అన్నం పెట్టిన చేతిని తెగనరకడమే సమకాలీన రాజకీయ లక్షణం కదా మరి.



కాళ్లకు మొక్కుతున్న సినీనటుడు మోహన్‌బాబు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంకి పెంచలయ్య.

# సమస్యలతో సహజీవనం చేస్తున్న కొత్తూరు ప్రజలు!

నెల్లూరు రూరల్ మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయితీలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. డ్రైనేజి కాల్వలు, అంతర్గత రోడ్లు, త్రాగునీటి సరఫరా తదితర సమస్యలు ఇక్కడి ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. గ్రామ పంచాయితీలోని సమస్యలపై పాలకవర్గం దృష్టిసారించి పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతోంది. ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులను సక్రమంగా వినియోగించలేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌కు సమీపంలో వున్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో మాత్రం బాగా వెనుకబడి పోయింది.

16 వార్డులు కలిగిన కొత్తూరు గ్రామ పంచాయితీకి సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన పద్మజ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పంచాయితీ పరిధిలో ఐదు వేల కుటుంబాలు, 16వేల జనాభా, 14వేల మంది ఓటర్లు వున్నారు. హెచ్.కె.బాబు కాలనీ, శ్రీలంక కాలనీ, శ్రామిక నగర్, చంద్రబాబు నగర్, రాజారెడ్డి నగర్, శివాజీ కాలనీ, రామకోటయ్య నగర్, చవటమిట్ట గిరిజన కాలనీలు ఈ పంచాయితీ పరిధిలో వున్నాయి. ఎస్ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు మూడు లక్షల 80వేల రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదలవుతుంటాయి. ఇవికాకుండా వివిధ పన్నుల రూపంలో మరో ఆరు లక్షల రూపాయలు పంచాయితీ రాబడిగా వుంది. ఈ నిధులను అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయాల్సి వుంటుంది.

గ్రామ పంచాయితీ సర్పంచ్ మహిళ కావడం వల్ల ఆమె భర్త అన్ని పనులు చేస్తుంటారు. పంచాయితీ పరిధిలో రెండు రోజులకోసారి త్రాగునీటి సరఫరా జరుగుతుంది. ఇక్కడ నివసించే ప్రజలు వివిధ కూలీ పనుల నిమిత్తం నగరానికి వెళ్తుంటారు. నీటి సరఫరా నిర్ణీత సమయంలో జరగకపోవడం కారణంగా ప్రజలు ఇబ్బందిపడక తప్పడం లేదు. అలాగే వివిధ కాలనీలు మురికివాడలను తలపించే విధంగా దర్శనమిస్తున్నాయి. డ్రైనేజి కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో మురికి నీరంతా వీధుల్లోకి చేరుతోంది. పంచాయితీకి వస్తున్న నిధులు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపుతున్న పాలకవర్గం, ఎక్కడ అభివృద్ధి పనులు చేశారన్న విషయాన్ని వెల్లడించడం లేదు.

స్థానికులు కనీస సదుపాయాల కోసం అనేక దఫాలు విన్నవించుకున్నా పాలకవర్గం స్పందించలేదన్న ఆరోపణలు వున్నాయి. ఈ క్రమంలో సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



### నిధుల కొరత!

గ్రామ పంచాయితీ పరిధిలో త్రాగునీటి ఎద్దడి నివారణ కోసం 30 లక్షల రూపాయలతో ట్యాంకును నిర్మించడం జరిగింది. దీనిని త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం. అలాగే డ్రైనేజి కాల్వలు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధుల కొరత వుంది. నిధులు విడుదలయితే పనులు చేపట్టి పంచాయితీని మరింత అభివృద్ధి చేస్తాను.

– పద్మజ, సర్పంచ్



### త్రాగునీటికి ఇక్కట్లు!

పంచాయితీ పరిధిలో త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అలాగే దోమల బెడద కూడా అధికంగా వుంది. అధికారులు, పంచాయితీ పాలకవర్గం స్పందించి పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుంది.

– షేక్ కరిముల్లా



నీరు వృథాగా పోతున్న కొళాయి.



శుభ్రపరచని చెత్త దిబ్బలు.

అవినీతి కథ

# జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలోనూ చేతివాటం!

జనన, మరణాల నమోదు ధృవీకరణ పత్రాల జారీలో మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది, సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో జనన, మరణాల నమోదు సక్రమంగా జరగడం లేదు. వివిధ ఆస్పత్రుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు అందుతున్నా నమోదు చేసుకోవడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రక్క జనన, మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రకటనలు చేస్తున్నా అధికారులు, సిబ్బంది మాత్రం అందుకు భిన్నంగా వుంటున్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం బాధితులు తిరుగుతున్నా వీరి గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారు.

నెల్లూరు నరగరంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతిరోజు పిల్లలు పుడుతుంటారు. ఆసుపత్రుల్లో పురుడు పోసుకునే వారు వివిధ ప్రాంతాలకు చెందిన వారుగా వుంటారు. పిల్లలతో సహా వారి గ్రామాలకు వెళ్లి కొన్ని నెలల తర్వాత పుట్టిన తేది ధృవీకరణ పత్రాల కోసం నగరంలోని మునిసిపల్ కార్యాలయానికి వెళ్లితే చుక్కెదురవుతుంది. పుట్టిన తేది అసలు నమోదు కాలేదని సిబ్బంది నుంచి సమాధానం వస్తుంది. ఇదిలా వుండగా బిడ్డ పుట్టిన తేది నమోదు కాబడి సంవత్సరం తర్వాత ధృవీకరణ పత్రాలు కోసం వెళ్లిన వారికి సైతం ఆర్డీఓ కార్యాలయం అనుమతి కావాలంటూ త్రిప్పి పంపుతుంటారు.

ధృవీకరణ పత్రాలకోసం వచ్చిన వారి అవసరాన్ని అడిగి తెలుసుకొని 5వేల రూపాయలు అందజేస్తే ఆర్డీఓ కార్యాలయం అనుమతి లేకుండానే ఇస్తామని సలహా కూడా ఇక్కడ సిబ్బంది ఇస్తుంటారు. కనీస ఫీజు తీసుకొని జారీ చేయాల్సిన ధృవీకరణ పత్రాలకు 5వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. మండల తహశీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరగలేని వారు ధృవీకరణ పత్రాల అవసరాన్ని దృష్టిలో వుంచుకొని సిబ్బంది అడిగిన మొత్తాన్ని అందజేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు మాత్రం బేరసారాలు సాగిస్తే చివరకు 3వేల రూపాయలకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు.

## మేయర్ బంధువు కావడంతో...

జనన, మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేసే విభాగం మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ పర్యవేక్షణలో వుంటుంది. హెల్త్ ఆఫీసర్ సుబ్బరాజు మేయర్ భానుశ్రీకి దూరపు బంధువు. దీంతో తాను ఏం చేసినా చెల్లుబాటు అవుతుందన్న ధీమాతో ఈయన వ్యవహరిస్తున్నాడు. జనన, మరణాల నమోదు కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి రమేష్‌బాబు అనే వుద్యోగిని డిప్యూటేషన్‌పై నియమించారు. ధృవీకరణ పత్రాల కోసం వచ్చే వారి నుంచి నగదు వసూలు చేసే కార్యక్రమం ఇతను నిర్వహిస్తుంటాడు. వసూలు చేసిన నగదును హెల్త్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ వాటాలుగా పంచుకొంటారు.

జనన, మరణాల ధృవీకరణ పత్రాల జారీ కోసం నగదు వసూలు చేస్తున్న విషయం మునిసిపల్ కమిషనర్‌కు తెలిసినా కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. హెల్త్ ఆఫీసర్ మేయర్ బంధువు కావడం వలన ఏమి అనలేక పోతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వున్న శానిటరి డివిజన్లలో కూడా జనన, మరణ ధృవీకరణ పత్రాలు అందజేయాల్సి వుండగా మామూళ్లు రావన్న వుద్దేశంతో మొత్తం కార్పొరేషన్ కార్యాలయం నుంచి అందజేస్తున్నారు. ఇకపోతే ఇదే విభాగంలో సిటిజన్ చార్టర్ కూడా అమలు చేయాలన్న బోర్డు మాత్రమే అందరికి దర్శనమిస్తుంది తప్ప అమలు మాత్రం జరగడం లేదు.




కార్పొరేషన్‌లోని జనన మరణ సర్టిఫికేట్లు జారీచేసే వివరాలు తెలిపే సిటిజన్ చార్టర్.

సిటిజన్ చార్టర్ ప్రకారం బాధితులకు నిర్ణయించిన సమయానికి పనులు జరగకపోయినా, ధృవీకరణ పత్రాలు అందజేయడంలో ఆలస్యం జరిగినా అందుకు అపరాధ రుసుంగా కార్పొరేషన్ చెల్లిస్తుందంటూ పెద్ద అక్షరాలు కనిపిస్తాయి. వాస్తవానికి బాధితులకు నగదు చెల్లించే విషయం ప్రక్కన పెడితే వారి నుంచి అదనపు నగదు వసూలు చేయకుంటే అంతే చాలు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే అవినీతి, అక్రమాలకు ఎప్పటికి ఫుల్‌స్టాప్ పడుతుందో?

# లీడర్ - బాగున్నాడు!



✍ అల్లూరు రహీం

ఆనంద్, గోదావరి, హ్యాపీడేస్ వంటి విలక్షణ ప్రేమకథా చిత్రాలను తీసిన దర్శకుడు శేఖర్ కమ్ముల మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలను మేళవిస్తూ జనరంజకంగా తీసిన చిత్రమే లీడర్. ఈ చిత్రానికి పలు ప్రత్యేకతలున్నాయి. పేరుగాంచిన చిత్ర నిర్మాణ సంస్థ ఎవిఎం ప్రొడక్షన్స్ తమ బ్యానర్‌పై 174వ చిత్రంగా ప్రముఖ నిర్మాత రామానాయుడు మనుమడు రానాను హీరోగా పరిచయం చేస్తూ తీసింది. ఈ చిత్రంలో నాయకుడికి, రాజకీయ నాయకుడికి మధ్య వున్న తేడాను దర్శకుడు శేఖర్ కమ్ముల చక్కగా చూపాడు. ముఖ్యంగా రాజకీయాల్లో అవినీతి, కులతత్వాలను ఈ చిత్రంలో కాస్త లోతుగా చర్చించారు. ఈ సినిమాలో ముఖ్యమంత్రి ప్రమాదవశాత్తు చనిపోవడం, ఆయన కుమారుడు అకస్మాత్తుగా ముఖ్యమంత్రి కావడం వంటి సన్నివేశాలు చూస్తున్న వారికి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జగన్‌లు గుర్తుకు వస్తారు. అయితే దర్శకుడు ఎక్కడా ఒక్క పార్టీని, కులాన్ని, ప్రాంతాన్ని సమర్థిస్తున్నట్లు కాకుండా ప్రతిభావంతంగా స్క్రీన్‌ప్లే బలంతో చిత్రాన్ని చకచకా ముందుకు నడిపారు. దర్శకుడు పాడిపాడిగా వ్రాసిన... వ్యవస్థ చెడిపోయింది. రాజకీయాలంటే రొచ్చు. సమాజంలో నీతి గల వాళ్లు లేరు. యువకులు నిద్రపోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మనది అభివృద్ధి చెందుతున్న దేశమే. ఎమ్మెల్యేకు రెండు కార్లు... 20 కోట్లు చాలవా? డబ్బు తీసుకోకుండా ఓటు వేయండి వంటి మాటలు ఆలోచింపజేస్తాయి. సినిమా మొత్తం రాజకీయం చుట్టూ తిరుగుతున్నా, యువ సిఎం చుట్టూ రెండు ప్రేమకథలు నడిపిన తీరు యువ ప్రేక్షకులను ఆకట్టుకొంటుంది. ఈ ప్రేమకథల్లో సిఎం స్కూటర్‌పై తన ప్రేయసితో విహరించడం, రెస్టారెంట్‌కు వెళ్లడం, క్యాండిల్ లైట్ డిన్నర్ చేయడం, సిఎంను పూర్తిగా నమ్మేసిన ఓ ప్రేయసి తన ఎద లోతుల్లోని పుట్టుమచ్చలు సైతం చూపడం... ఇవన్నీ హద్దులు దాటకపోవడం బాగుంది. పాత తరం గాయని టంగుటూరి సూర్యకుమారి అప్పుడెప్పుడో పాడిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటను దర్శకుడు చక్కగా ఈ సినిమాలో వాడుకొన్నాడు. హేయ్ సిఎం... చరణంతో సాగే హమ్మింగ్ పాట, టీవీ యాంకర్ ఉదయ భానుపై రాజశేఖరా నీపై మోజుతీర లేదురా అంటూ తీసిన పాట 'ఖవ్వాలీ' సాంప్రదాయాన్ని గుర్తు చేస్తుంది. సిఎం కొడుకు సిఎం అయ్యేందుకు అవినీతి మార్గాన్ని ఎంచుకొని ఆయనే అవినీతి నిర్మూలనకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టడం వంటి అంశాలలో కాస్త గందరగోళం కనిపిస్తుంది.

చిత్ర సమీక్ష

ఇక చిత్రకథ లోనికి వెళ్తే రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీవయ్య(సుమన్) పర్యటనలో వుండగా ఆయన పయనిస్తున్న కారును పేల్చేస్తారు. కానీ ఈ పని ఎవరు చేయిస్తారో తెలియదు. సంజీవయ్య చనిపోక మునుపే ఎవరు ముఖ్యమంత్రి కావాలన్న విషయమై పెద్ద రాజకీయ గందరగోళం జరుగుతుంది. కింగ్ మేకర్ మహదేవయ్య(కోట శ్రీనివాసరావు) తన కులస్తుడు, బంధువైన ధనుంజయ(సుబ్బరాజు)ను సిఎం చేయను అంతా సిద్ధం చేస్తాడు. ఆ సమయంలోనే తన తల్లి రాజేశ్వరి(సుహాసిని)తో సహా మహదేవయ్య వద్దకు వెళ్లే దివంగత ముఖ్యమంత్రి సంజీవయ్య కుమారుడు అర్జున్‌ప్రసాద్(రానా) తనను సిఎం కమ్మని తండ్రి చెప్పాడంటాడు. అంతకుముందే అర్జున్‌ప్రసాద్ ఒక్కో ఎమ్మెల్యేకు రహస్యంగా రెండుకోట్లు కానుకగా అందజేస్తాడు. దీంతో సిఎంను ఎన్నుకొనే పార్టీ సమావేశంలో అందరూ అర్జున్ వైపే మొగ్గు చూపుతారు. అప్పటి నుంచే అసలైన రాజకీయ చదరంగం మొదలవుతుంది. ముఖ్యమంత్రి అయిన క్షణంలోనే తన తండ్రి అక్రమంగా సంపాదించిన 20వేల కోట్ల రూపాయలను ప్రజాభవిష్య నిధిలో అర్జున్ జమచేస్తాడు. అవినీతిపై సమర శంఖం పూరి స్తాడు. కానీ దీన్ని అన్ని పార్టీల ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తారు. సిఎంను సమర్థించే వారు తగ్గిపోతారు. ఈ దశలో పార్టీ ముఖ్యనేత మునుస్వామి(ఆహుతి ప్రసాద్) కుమార్తె అర్చన(రీచా గంగోపాధ్యాయ)ను తన ప్రేమ ముగ్గులోనికి దింపి అర్జున్ ప్రభుత్వాన్ని కాపాడుకొంటాడు. సిఎం చేపట్టే చర్యలను మాత్రం జనం హర్షిస్తుంటారు. కానీ ప్రభుత్వ నిర్వహణ కష్టం కావడంతో ఒకరోజు ఎమ్మెల్యేలు, వారి బంధువుల ఇళ్లపై ఏసిబి దాడులకు పురికొల్పి 80వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యేలా చేసే యువ ముఖ్యమంత్రి అదే రోజు తన పదవికి రాజీనామా చేస్తాడు. అనంతరం స్వంత పార్టీ స్థాపించి రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సినిమా ముగుస్తుంది.

రానా తొలి పరిచయమైనా పాత్రోచితంగా ఆయన నటన అదిరింది. హీరోయిన్లు రీచా గంగోపాధ్యాయ, ప్రియా ఆనంద్‌లు ముద్దుగా వున్నారు. నిస్వార్థ యువకులు రాజకీయాల్లోకి వస్తే సమాజానికి జరిగే మేలును చూడను లీడర్‌కు వెళ్లొచ్చు.

## ఇద్దరు మిత్రులు





తెలుగు, తమిళ భాషల్లో కథానాయికలుగా మంచి గుర్తింపు తెచ్చుకొన్న శ్రియ, రీమాసేన్ మంచి మిత్రులు. సినిమాల విషయంలోనే కాకుండా, ఏ విషయంలోనైనా వీరిద్దరూ కలసి చర్చించుకొంటారు. ఒకరి సలహాలు మరొకరు స్వీకరిస్తారు. పార్టీలకు సైతం ఇద్దరూ కలసి హాజరవుతారు. ఇటీవల వీరిద్దరు తమ బాయ్‌ఫ్రెండ్స్‌తో కలసి ముంబాయిలోని ఓ పబ్‌లో మద్యం సేవించి భీభత్సం చేశారు. ఈ సమయంలో ఎవరో ఒక తుంటరి ఈ వ్యవహారాన్ని తన సెల్‌లో చిత్రీకరించి ఇంటర్నెట్‌లో పెట్టడంతో ఇద్దరు మిత్రులు కోనకిస్కా గొట్టంగాడంటూ తిట్టి పోస్తున్నారు. బాగుంది కదూ ఈ ఇద్దరి వరుస.

## త్రిష... కమల్‌ల ముద్దు ముచ్చట



మంచినటుడు కమల్‌హాసన్ సరసన నటించను ఏ హీరోయిన్ అయినా కాదనదు. ఆయన తన సరసన నటించిన రేవతి, మనీషా కోయిరాల, స్రిమాన్, గౌతమి, అభిరామి వంటి నటీమణులను ముద్దాడారు. గతంలో కమల్ హాసన్ ప్రారంభించిన ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ మర్మయోగి చిత్రంలో హీరోయిన్‌గా త్రిషను తీసుకొన్నాడు. అయితే ఆ చిత్రం ప్రారంభానికి బాలారిష్టాలు మొదలయ్యాయి. దీంతో కొత్త చిత్రం యావరుమ్ కేళీర్ (అందరూ వినాలి) ప్రారంభించాడు. మర్మయోగి డేట్స్‌ను త్రిష ఈ చిత్రానికి సర్దింది. ఈ చిత్రంలో కమల్, త్రిషలకు ఒక ముద్దు సన్నివేశం వుందట. అందరూ ఈ విషయమై త్రిషను అడుగుతున్నా ఆమె సమాధానం చెప్పడం లేదు. దీంతో తమిళనాట ఈ చిత్రం పేరును యావరుమ్ కేళీర్ కాదు యావరుమ్ పారంగే (అందరూ చూడరండి) అని దెప్పి పొడుస్తున్నారు. అయినా త్రిషను కమల్ ముద్దాడితే అందరూ చూడవలసిందేగా?



## ఇలియానా పుస్తకాల పురుగు!

షూటింగ్ గ్యాప్‌లలో హీరోయిన్లు బాయ్‌ఫ్రెండ్స్‌తో సెల్ ఫోనుల్లో బాతాఖానీ చేస్తుంటారని ప్రతీతి. గోవా సుందరి ఇలియానా దీనికి వ్యతిరేకం. ఖాళీ దొరికితే చాలు పుస్తకాల్లో దూరేస్తుంది. ఈ విషయమై మాట్లాడుతూ పుస్తకాలు చదవడం నా అలవాటు. చాలా ఇష్టం కూడా. ఫిక్షన్, సస్పెన్స్ తరహా పుస్తకాలు ఆసక్తిగా చదువుతాను. వ్యక్తిత్వవికాస పుస్తకాలైతే పదం పొల్లు పోకుండా చదువుతాను. నేను సిడ్నీషెల్డన్ అభిమానినంటూ పుస్తకాలతో తనకున్న అనుబంధాన్ని వివరించిందీ కిక్ సుందరి.

## బిపాస ఆహార కాండ



బెంగాలీ అందగత్తె, బాలీవుడ్ హీరోయిన్ బిపాస బసుకు తమ ప్రాంత భోజనమంటే భలే యిష్టమట. ఇంట్లోని వంట మనిషికి బెంగాలీ వంటలు వండడం రాదట. దీంతో బిపాస ఇటీవల ముంబాయి సరిహద్దుల్లోని ఓ బెంగాలీ దాబాకు వెళ్లిందట. మెనూ తెలుసుకొని తనకు కావాల్సిన ఐటమ్స్ లిస్ట్ వ్రాసిందట. బిపాస తమ హోటల్‌కు రావడమే గొప్పగా భావించిన ఆ దాబా యజమాని ఆమెను ప్రత్యేక గదిలో కూర్చోపెట్టి ఆమె కోరిన విధంగా బెంగాలీ వంటకాలు వండి పెట్టాడట. పోతూ పోతూ కొన్ని పార్శిల్స్ కూడా ఇంటికి పట్టుకెళ్లిందట. ఈ వ్యవహారంలో మరో ముచ్చట వుంది. బెంగాలీ వంటకాలను మంచి రుచితో చేసిన ముఖ్య వంట మనిషిని వంటశాలలోనికి వెళ్లి మరీ బిపాస అభినందించేసరికి అతనింక ఆ రోజు వంట వార్పు ఆపేసినంత పని చేశాడట.



## నాకు నేనే ఆదర్శం!

నాగచైతన్య సరసన ఏమాయ చేసావె చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న సుమంతను వసపిట్ట అనాలి. షూటింగ్ గ్యాప్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాపేరుకు అర్థమేమిటో తెలుసా? ప్రార్థనలను శ్రద్ధగా వినే వ్యక్తి అని. నేను కూడా ఎవరైనా చెబితే బుద్ధిగా వింటా. ముందు తమిళ చిత్రంలో అవకాశం వచ్చింది. నచ్చిన భోజనం బాగా తింటాను. వ్యాయామాలు గట్టా చేస్తాను. నాకు ఎవరూ రోల్ మాడల్స్ లేరు. నేను నలుగురికి రోల్ మాడల్‌గా వుండాలని తాపత్రయపడుతున్నానంది.

# ఎసి స్టేడియంలో కీచక కోచ్

## అల్లాడుతున్న హాస్టల్ విద్యార్థినులు

క్రీడాకారులకు తగిన శిక్షణనిచ్చిన వారి ఉన్నతికి తోడ్పడాల్సిన కోచ్ కీచకుడిలా వ్యవహరిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వైనం ఆలస్యంగా తెలియవచ్చింది. నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారిణుల కోసం స్పోర్ట్సు హాస్టల్ ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన బాలికలు కోకో, కబడ్డీ, బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ కోకో కోచ్‌గా వున్న యతిరాజులు క్రీడాకారిణులను లైంగికంగా వేధిస్తుండడంతో ఎవరికీ చెప్పుకోలేక పంటి బిగువన ఆ బాధలు భరిస్తూ కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. తన కోరిక తీర్చమని ఒత్తిడి చేస్తున్న ఈ కీచక కోచ్ అందుకు ఒప్పుకోని వారిని వెకిలి మాటలు, ద్వందార్థపు సంభాషణలతో మానసికంగా హింసిస్తుండడంతో పాపం బాలికలు అక్కడ వుండలేక, ఎవ్వరికీ చెప్పుకోలేక లోలోపల కుమిలి పోతున్నారు. హాస్టల్‌లో వుండే క్రీడాకారిణులు అధిక భాగం పేద కుటుంబాల నుంచి వచ్చినవారు కావడంతో దీనిని ఆసరాగా తీసుకొని కోచ్ వేధింపులకు గురిచేస్తున్నాడట. సాధారణంగా బాలికలకు నెల నెల వచ్చే పీరియడ్స్ సమయంలో వారం రోజులపాటు వారికి క్రీడా శిక్షణ నుంచి విశ్రాంతినిస్తారు. కోచ్ యతిరాజులు మాత్రం ఆ సమయంలోనూ వారిని శిక్షణకు పిలిచి హింసించడం అతని పైశాచిక ప్రవర్తనను తెలియజేస్తుంది. ఇలాగే ఒక అమ్మాయికి శిక్షణ నివ్వడంతో రక్తస్రావం అయి ప్రాణాల మీదకు రావడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపివేశారట. ఈ నీచుడికి స్టేడియంలో క్లర్క్‌గా పనిచేసే విజయ్, కోకో క్రీడాకారుడు, ఎఆర్ కానిస్టేబుల్ విజయ అనే మరో వ్యక్తి తోడవడంతో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. మద్యం సేవించడం, తమ మాట వినని వారిని వేధించడం నిత్యకృత్యం అయ్యింది. కోచ్ గతంలో కాకినాడలో పనిచేసే సమయంలోనూ ఇలాగే వికృత చేష్టలకు పాల్పడడంతో అక్కడి వారు ఆయనకు దేహశుద్ధి చేశారట. ఇలాంటి కార్యకలాపాలకు ప్రస్తుతం ఎసి స్టేడియం కేంద్రం కావడంతో ఒకనాడు 100 మంది క్రీడాకారులుండే హాస్టల్‌లో వారి సంఖ్య 20 మందికి పడిపోయింది.



ఎసి స్టేడియంలోని క్రీడాకారిణుల హాస్టల్.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీల నిర్వాహకులు.

# కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ ధర్నా!

అంగన్‌వాడీ కేంద్రాలను పంచాయితీలకు అప్పగించేలా జారీచేసిన 41, 42 జిఓలను రద్దు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 19వ తేది ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు ముప్పు తెచ్చే జిఓలను రద్దు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే ఆహారం పంపిణీ బాధ్యత కూడా స్వచ్ఛంద సంస్థలకు, స్వయం సహాయక గ్రూపులకు అప్పజెప్పాలని చూస్తుందని, ఇలా చేస్తే ఈ కేంద్రాలు కుప్పకూలుతాయన్నారు. సమస్య పరిష్కారం కోరుతూ ప్రధానమంత్రి, కేంద్ర శిశు సంక్షేమ శాఖా మంత్రి, ముఖ్యమంత్రికి సంఘం టెలిగ్రాములు పంపింది. ధర్నాకు సంఘం జిల్లా అధ్యక్షురాలు రెహనాబేగం, స్వరూపారాణి, షీబా, హైమావతి తదితరులు నాయకత్వం వహించారు.

# నెల్లూరు ఐటిఐలో సౌకర్యాలలేమి!

విద్యార్థులకు శిక్షణనిచ్చి వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐటిఐ కళాశాలలు ఏర్పాటయ్యాయి. కాలక్రమేణా ఈ కళాశాలల్లో చదివే విద్యార్థుల బాగోగులు పట్టించుకొనేవారు కరువవడంతో ఇవి నామకార్థంగా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా నెల్లూరు, కావలి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలు వున్నాయి. వీటిలో ఎందులోనూ సౌకర్యాలు లేవు. మిగతా కోర్సులు చదివే విద్యార్థుల కంటే భిన్నంగా ఈ కళాశాలల్లో శిక్షణ పొందేవారికి ప్రాక్టికల్స్ ఎంతో అవసరం. కానీ దీనికి అవసరమైన పరికరాలు, వాహనాలు లేకపోవడంతో విద్యార్థులు అరకొర వసతుల నడుమ శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది. వెంకటేశ్వరపురం ఐటిఐ కళాశాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1957లో ఏర్పాటైన ఈ కాలేజిలో 14 ట్రేడ్‌లలో విద్యార్థులు శిక్షణ తీసుకొంటున్నారు. కానీ ఇక్కడ విద్యార్థులకు అవసరమైన పరికరాలు లేవు. మోటారు వాహనాలు ఎప్పటివో పాతవి కావడంతో అవి తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. శిక్షకుల కొరత విద్యార్థులను పట్టి పీడిస్తోంది. దాదాపు 21 మంది వరకు శిక్షకులు లేకపోవడంతో వున్న ఇన్‌స్ట్రక్టర్‌లతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు భవనాలు శిథిలమై కూలిపోయేలా వున్నాయి. ఇలాంటి వాతావరణంలో విద్యార్థులు ఎంతమేర ఆయా కోర్సులలో నైపుణ్యం సాధిస్తారనేది అనుమానమే.


సమస్యల లోగిలి నెల్లూరు ఐటిఐ.

# జైన్ గోల్డ్‌లో స్పెషల్ ఆఫర్లు


జైన్‌గోల్డ్ స్పెషల్ ఆఫర్ల స్కీమ్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మేయర్ భానుశ్రీ.

తమ వ్యాపార వున్నతికి తోడ్పడే ఖాతాదారులను గురించి పట్టించుకొనే వ్యాపార సంస్థలు అరుదుగా వుంటాయి. వారికి ఖరీదైన బహుమతులను అందజేసే వ్యాపారులు అతి తక్కువ మందే వుంటారు. వారిలో నెల్లూరులోని జైన్ గోల్డ్ సంస్థ నిర్వాహకుల గురించి చెప్పుకోవాలి. తమ వ్యాపారాభివృద్ధికి కారకులైన కస్టమర్ల కోసం ప్రతి ఏడాది ఏదో ఒక ఆఫర్లు ప్రవేశపెట్టడం జైన్‌గోల్డ్ ప్రత్యేకత. ఇప్పుడు సరికొత్త బహుమతులను మహిళల కోసం ప్రకటించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది, అక్షయ తృతీయ పండుగలతోపాటు షోరూం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 13 వారాలపాటు లక్కీడ్రా నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 22 నుంచి మే 22 వరకు జరిగే ఈ డ్రాలో వారం వారం స్కూటీని బహుమతిగా అందజేస్తున్నట్లు జైన్‌గోల్డ్ అధినేత మణిలాల్ జైన్ ప్రకటించారు. 10వేల రూపాయలకు ఆభరణాలను కొనుగోలు చేసే వారికి ఒక్కో కూపన్ అందించి వాటిని డ్రా తీస్తామన్నారు. స్కీం అమలులో వుండే పదమూడు వారాలు పదమూడు స్కూటీలు అందజేస్తామన్నారు. బంగారు, వజ్రాభరణాలతో రూపొందించిన గాజులు, వడ్డాణాలు, బ్రాస్‌లెట్లు, ఉంగరాలు, డైమండ్ వాచీలు, చైన్లు వివిధ మోడళ్లలో అందుబాటులో వుంచామన్నారు. తమ డిజైనర్లు రూపొందించిన ప్రత్యేక డిజైన్లు సిద్ధంగా వున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జైన్‌గోల్డ్ ప్రవేశపెట్టిన స్కీం వేడుకలను మేయర్ భానుశ్రీ 22వ తేది ప్రారంభించి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జైన్‌గోల్డ్ నిర్వహకులు నరేంద్రజైన్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్లనూ వదలడం లేదు!

తమ విధులు సక్రమంగా నిర్వహించాల్సింది పోయి అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు వెంకటేశ్వరపురంలోని గోడౌన్ ఉద్యోగులు భలే ఎత్తువేశారు. గిడ్డంగుల చుట్టుప్రక్కల వుండే పెద్ద పెద్ద చెట్లను అక్రమంగా నరికించి ఆ కలపను వేలాది రూపాయలకు అమ్ముకొని జేబులు నింపుకోవడం వారి అక్రమార్జనను తెలియపరుస్తున్నది. పది ఎకరాల విస్తీర్ణంలో వుండే ఈ గోడౌన్లలో బియ్యం, పప్పుధాన్యాలు తదితర సామాగ్రిని నిల్వ చేస్తుంటారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వుండే గోదాముల్లో పనిచేసే ఉద్యోగులు ఇక్కడ పెరిగే టేకు, ఇతర చెట్లను తమ ఆదాయ వనరులుగా మల్చుకొన్నారు. విలువైన ఈ చెట్లను నరికించి వచ్చిన కలపను వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడం చర్చనీయాంశమైంది. కంప చెట్లను తొలగిస్తున్నామనే సాకుతో దొంగతనంగా చెట్లను తొలగించి గుట్టుచప్పుడు కాకుండా లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తుండడంతో గిడ్డంగులుండే ప్రాంతంలో వుండేచెట్లు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. సాధారణంగా ప్రభుత్వానికి సంబంధించిన చెట్లను తొలగించాలంటే, వాటికి టెండర్ పిలిచి తర్వాత అమ్మకాలు సాగించాల్సి వుంటుంది. అలాంటిది ఉద్యోగులు బరితెగించి చెట్లను కొట్టించి సొమ్ము చేసుకోవడం వారి అవినీతిని తెలియపరుస్తోంది.


వెంకటేశ్వరపురంలోని సెంట్రల్‌వేర్ హౌసింగ్ సంస్థ గిడ్డంగులు.

# రాజీవ్‌భవన్ దెబ్బకు వూరిని పట్టిన దయ్యం జడుస్తున్నది!

## నగరానికి దరిద్రం పట్టించి తాను కుబేరత్వం సాధించుకొన్న మేయర్ భానుశ్రీ ఆస్తులు జిల్లా పొలిమేరలే కాదు రాష్ట్రాల సరిహద్దులు దాటాయి

రాజీవ్‌భవన్ యువ కాంగ్రెస్ నేతల బృందానికి ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి మధ్య రాజకీయ స్పర్థ దావానలం వలె విస్తరిస్తున్నది. చిల వలు పలవలుగా వ్యాపిస్తున్నది. నెల్లూరు నగరంలో ఆనం వారిని ఎదిరించి ఎవరూ నిలబడలేరనే దురభిప్రాయం ఒకటి వుంది. దానితో ఎంతోమంది వారంటే సరిపడకపోయినా మౌనంగా పక్కకు తప్పుకొంటారే తప్ప ఎదిరించా లనుకోరు. ఆ భ్రమలన్నిటినీ తుడిచి పెడు తున్నారు రాజీవ్‌భవన్ నిర్వాహకులు. నువ్వెంత అంటే నువ్వెంత అనే ధోర ణిలో యుద్ధానికి సై అంటున్నారు. సవాళ్లు విసురుతున్నారు.

పాతాళభైరవి మాంత్రికుడు ప్రాణం మర్రిచెట్టు తొర్రలోని చిలుక గొంతులో వుంటే, ఆనం వివేకానందరెడ్డి ప్రాణం నెల్లూరు మేయర్ భానుశ్రీ వద్ద వుంటుం దన్నది జగమెరిగిన సత్యం. ఆమె మీద ఈగ వాలితే తన మీద ఏనుగు పడి నంతగా విలవిలలాడి పోతారాయన. ఈ కిటుకు బాగా వంటబట్టింది కోటం



రెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైవి.రామిరెడ్డి, అనిల్ కుమార్, రూప్‌కుమార్, తాటి వెంకటే శ్వర్లు వగైరా బృందానికి.

మేయర్‌గా భానుశ్రీ విశ్వరూపం తెలియనివారు లేరు. నెల్లూరు నగరం మొత్తాన్ని తన సామ్రాజ్యంగా మలచు కొని, దానికి తానే పట్టపురాణి అన్నట్లు వ్యవహరిస్తున్నారావె. కార్పొరేషన్ ఆఫీసు ఆమె పాలిట కామధేనువు. ఎంత పిండినా తరగని అవినీతి గని అది. దానితో నగరానికి దరిద్రం పట్టించి, తాను కుబేరత్వం సాధించుకొన్నది. ఆమె ఆస్తులు జిల్లాల పొలిమేరలే కాదు రాష్ట్రాల సరిహద్దులు కూడా దాటాయని చెప్తారు. ఈ అంతులేని దోపిడీ మీద దృష్టి పెట్టింది రాజీవ్‌భవన్ బృందం. తీగలాగితే డొంక కదిలినట్లుంది పరిస్థితి. ఏ వూరిలో వెతికినా ఆమె ఆస్తులు దర్శనమిస్తున్నాయట. వాటి విలువ ఎన్ని కోట్లో లెక్క వేయడానికి ఎవరైనా నిపు ణులు కావల్సి వచ్చేట్లుంది. శ్యాంపిల్‌గా ఒక చిన్న ఆస్తి వివరాలు పత్రికల వారికి అందజేశారు. ఈనాడు దినపత్రిక దాన్ని ప్రముఖంగా ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యే కెవి.సుబ్బారెడ్డి ఇంట్లో చాలా కాలం నుంచి పనిమనిషిగా పని చేస్తున్న ఒక నిరుపేద మహిళ కుటుంబం



పేరుతో పెట్టిన ఆస్తి అది. అరవింద నగర్‌లో అంకణం రెండు లక్షల రూపా యల విలువ పలికే ప్రాంతంలో వున్న ఖరీదైన ఆస్తి ఇది. రిజిష్టర్ విలువ 18 లక్షలు. అందులో 17 లక్షల యాభైవేలు ఆ పనిమనిషి పేరుతో, తతిమా యాభై వేలు తన పేరుతో వ్రాసి, రిజిష్టర్ చేసి వుంది. పూట గడవక పొది పని చేసు కొనే కుటుంబానికి కోట్లు చేసే స్థలాలు ఎక్కడ నుంచి వస్తాయి? ఎట్లా వస్తాయి? ఇదొక్కటే కాదు, పొదలకూరు, మను బోలు మండలాలలో కూడా ఇదే పేరుతో పెద్ద పెద్ద ఆస్తులు రిజిష్టర్ అయి వున్నాయి. దాని అర్థం, ఆ పేద కుటుం బాన్ని తన బినామీగా వాడుకోవడమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా?

ఈ వార్త రాగానే భానుశ్రీ రెచ్చి పోయారు. వివేకా మీద కోపం తన మీద తీర్చుకొంటున్నారని, ఇటువంటి బెదరింపులకు తాను భయపడనని, వివేకా వున్నన్ని రోజులూ తనను ఎవరూ ఏమీ చేయలేరని పత్రికా విలేకరుల

కొరవ 14వ పేజీలో




ఉత్తరక్రియలు

మమతానురాగాల అమృతమూర్తి
మాఇంటిదైవం
శ్రీ మొలకల గోపాలకృష్ణారెడ్డి గారు
తేది 20-2-2010 శనివారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

: ఉత్తరక్రియలు :

తేది 03-03-2010 బుధవారం రాత్రి నిలుపు
తేది 04-03-2010 గురువారం ఉదయం పెద్దకర్మ
కోవూరు, కాపువీధిలోని మా స్వగృహము నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.
ఫోన్ : 9347008577, 9849047247

అశ్రునయనాలతో...

కుమార్తెలు - అల్లుళ్లు
వరిబిరెడ్డి నిర్మల - గోపాలరెడ్డి
కాండ్ర ఇందిర - స్వర్గీయ కె.యస్.రెడ్డి

కుమారులు - కోడళ్లు
మొలకల ఆదిశేషారెడ్డి - ప్రసూన
మొలకల భాస్కర్‌రెడ్డి - అరుణ

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు

శ్రీ మొలకల గోపాలకృష్ణారెడ్డి గారు
పారిశ్రామికవేత్త, సినీనిర్మాత
జననం : 17-08-1923 కాపువీధి, కోవూరు. మరణం : 20-2-2010


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.